Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 324 మేడ్చల్ మల్కాజ్‌గిరి 13 డిసెంబర్ 2023 బుధవారం పేజీలు : 4

## సుప్రీంను ఆశ్రయించిన మహువా

న్యూఢిల్లీ : తనను లోక్‌సభ నుంచి బహిష్కరించడాన్ని సవాలు చేస్తూ తృణమూల్ కాంగ్రెస్ సభ్యురాలు మహువా మొయిత్రా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పార్లమెంటులో ప్రశ్నలు అడిగేందుకు పారిశ్రామికవేత్త నుంచి డబ్బులు తీసుకున్నారన్న నేరంపై లోక్‌సభ ఆమెపై ఈ నిర్ణయం తీసుకొంది. ఆమెపై వచ్చిన ఫిర్యాదులపై తొలుత ఎథిక్స్ కమిటీ దర్యాప్తు జరిపింది. ప్రశ్నలు అడిగేందుకు బహుమతులు తీసుకున్నారని, ఇతర సౌకర్యాలు పొందారని, అందువల్ల ఆమెను లోక్‌సభ నుంచి బహిష్కరించాలని సిఫార్సు చేస్తూ ఆ కమిటీ నివేదిక సమర్పించింది.

దాని ఆధారంగా చేసుకొని ఆమెను ఎంపీ పదవి నుంచి బహిష్కరిస్తూ ఈ నెల ఎనిమిదో తేదీన లోక్‌సభ తీర్మానాన్ని ఆమోదించింది.



# సీఎం రేవంత్ దూకుడు

# అధికారుల్లో గుబులు!

## పాలనా యంత్రాంగంలో మార్పుచేర్పులకు కొత్త సర్కారు కసరత్తు

హైదరాబాద్: రాష్ట్ర పాలనా యంత్రాంగంలో భారీస్థాయిలో మార్పులు చేపట్టేందుకు కొత్త సర్కారు రంగం సిద్ధం చేస్తున్నట్టు సమాచారం. ప్రత్యేక ప్రధాన కార్యదర్శుల నుంచి జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్ల వరకు అఖిల భారత సర్వీసు అధికారుల బదిలీల కోసం కసరత్తు జరుగుతున్నట్టు ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి. ముఖ్యమంత్రి, మంత్రులు బాధ్యతలు స్వీకరించిన వెంటనే సమీక్షా సమావేశాలు నిర్వహించడం వెనుక ఉద్దేశం కూడా ఇదేనని పేర్కొంటున్నాయి. ప్రాథమికంగా సమీక్షించి, ఆయా శాఖల్లో ఏం జరుగుతోందన్న అంశాలను అవగాహన చేసుకున్నాక.. ప్రక్షాళన మొదలుపెట్టనున్నట్టు వివరిస్తున్నాయి.

**కొందరు అధికారులపై ఫోకస్** : కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పలువురు అధికారులు బీఆర్ఎస్ సర్కారుకు తొత్తులుగా పనిచేస్తున్నారంటూ విమర్శలు గుప్పించింది. హైదరాబాద్ పరిసర ప్రాంత జిల్లాల కలెక్టర్ల పనితీరుపై ఆరోపణలు చేసింది. ఈ నేపథ్యంలో.. ప్రస్తుతం రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శిగా ఉన్న నవీన్ మిట్టల్, పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్, ఐటీ–పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, సింగరేణి సీఎండీ శ్రీధర్, పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, నీటి పారుదల శాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్‌లకు స్థానభ్రంశం తప్పదన్న అభిప్రాయం ప్రభుత్వ వర్గాల్లో వినిపిస్తోంది. నవీన్ మిట్టల్ రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శితోపాటు సీసీఎల్ఏగా కూడా కొనసాగుతున్నారు. ఆయన స్థానంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు లేదా శశాంక్ గోయల్‌ను నియమించే అవకాశాలు ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఇక ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని తక్షణమే మార్చే ఉద్దేశం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఆమెను మార్చే పక్షంలో రామకృష్ణారావుకు సీఎస్ బాధ్యతలు అప్పగించవచ్చని అంటున్నారు.

**రిటైరైనా కొనసాగుతున్నవారికి ఉద్వాసన** : పదవీ విరమణ చేసిన దేవాదాయ, పౌరసరఫరాల శాఖ కమిషనర్ అనిల్‌కుమార్‌ను గత ప్రభుత్వం అదే పోస్టులో కొనసాగిస్తూ వచ్చింది. ఇప్పుడు ఆయనకు ఉద్వాసన పలికే అవకాశం ఉందని అంటున్నారు. మైనారిటీ సంక్షేమశాఖ కార్యదర్శిగా ఉన్న రిటైర్డ్ అధికారి సయ్యద్ ఒమర్ జలీల్, పశు సంవర్ధకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా తిరిగి నియమితులైన అదర్‌సిన్హా, కార్మిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా తిరిగి నియమితులైన రాణి కుముదిని తదితరులనూ తప్పించనున్నట్టు చెప్తున్నారు.

**అప్రాధాన్య పోస్టుల్లో ఉన్న కీలక అధికారులకు..** గత సర్కారు అప్రాధాన్య పోస్టుల్లో కొనసాగించిన సీనియర్ ఐఏఎస్ అధికారుల జాబితాలో.. బుర్రా వెంకటేశ్వర్లు (వెనుకబడిన తరగతుల శాఖ కార్యదర్శి), అనితా రామచంద్రన్ (టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి), విజయేంద్ర (ప్రత్యేక కార్యదర్శి ఆర్అండ్‌బీ), రాహుల్ బొజ్జా (విపత్తుల నిర్వహణ కార్యదర్శి) తదితరులు ఉన్నారు. వీరికి ప్రాధాన్య పోస్టులు లభించే అవకాశం ఉందని చర్చ జరుగుతోంది. మరోవైపు గత ప్రభుత్వంలో ఓ వెలుగు వెలిగిన ఉన్నతాధికారులు కేంద్ర సర్వీసులకు వెళ్లడానికి అప్పుడే ప్రయత్నాలు మొదలెట్టినట్టు ప్రచారం జరుగుతోంది.

**కలెక్టర్లకూ స్థాన చలనం** : కలెక్టర్లలో సంగారెడ్డి కలెక్టర్ శరత్, భూపాలపల్లి కలెక్టర్ భవ్యేశ్ మిశ్రా, రాజీవ్‌గాంధీ హన్మంతుతోపాటు పలువురు అధికారులకు స్థానభ్రంశం తప్పదని ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి. గతంలో రంగారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్‌గా చేసి.. పీఎంవోకు డిప్యూటేషన్‌పై వెళ్లిన కాట ఆమ్రపాలి తిరిగి రాష్ట్ర సర్వీసులకు వచ్చారు. ఆమె పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్నారు. ఇక ఢిల్లీలోని తెలంగాణ భవన్ ఓఎస్డీగా ఉన్న సంజయ్ జాజు తిరిగి హైదరాబాద్‌కు వచ్చే అవకాశం ఉంది. వీరు కాకుండా మరో అరడజను మంది వరకు అధికారులు కేంద్ర ప్రభుత్వ సర్వీసులో ఉన్నారు. వారు ఐదేళ్లపాటు కేంద్ర సర్వీసుల్లో డెప్యుటేషన్ పూర్తి చేసుకున్నాకే రాష్ట్ర సర్వీసుకు వస్తారు. ఒకవేళ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కోరితే రిలీవ్ చేసే అవకాశం ఉంటుంది.

# బీఆరెస్స్ భ్రమల్లో ఉందా..!

హైదరాబాద్ : తెలంగాణలో ఎన్నికలు ముగిసాయి. సుమారు 10ఏళ్ల పాటు టీఆరెస్స్ (బీఆరెస్స్) ప్రభుత్వ పాలన చూసిన ప్రజలు మూడోసారి కాంగ్రెస్ కు పట్టం కట్టారు. ఇందులో భాగంగా 64 సీట్లతో కాంగ్రెస్ కు అధికారం అప్పగించారు. ఈ సమయంలో బీఆరెస్స్ 39 సీట్లకే పరిమితం అయింది. ఈ సమయంలో పలువురు బీఆరెస్స్ నేతలు చేస్తున్న వ్యాఖ్యలు రాజకీయవర్గాల్లో తీవ్ర చర్చనీయాంశం అవుతున్నాయి. అవును... తెలంగాణలో ప్రజలు కాంగ్రెస్ కు మేన్డేంట్ ఇచ్చారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా పలువురు నేతలు మంత్రులుగా ప్రమాణస్వీకారాలు చేశారు. ఇప్పుడిప్పుడే మంత్రులు బాధ్యతలు స్వీకరిస్తున్నారు. ఈ సమయంలో బీఆరెస్స్ నేతలు మాత్రం... కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటు విషయాన్ని జీర్ణించుకోలేకపోతున్నారనే కామెంట్లు వినిపిస్తున్నాయి. అందుకు కారణం పలువురు నేతలు చేస్తున్న కామెంట్లే! తాజాగా జనగామ బీఆరెస్స్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఈ తరహా వ్యాఖ్యలు చేశారు. ఇందులో భాగంగా... కాంగ్రెస్ ప్రభుత్వం ముమ్మాటికి పడిపోతుందని వ్యాఖ్యానించారు. అధికారం కోల్పోయామని అధైర్యపడొద్దని పార్టీ కార్యకర్తలను కోరుతున్న సందర్భంగా స్పందించిన ఆయన... ఎన్ని రోజులు పడుతుందో తెలియదు కానీ వచ్చేది బీఆరెస్స్ ప్రభుత్వమే అని చెప్పుకొచ్చారు. పైగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆ పార్టీలోని నేతలే పడగొట్టుకుంటారని.. త్వరలో తిరిగి బీఆరెస్స్ ప్రభుత్వం ఏర్పడుతుందని.. కార్యకర్తలు ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని ధైర్యంగా ఉండాలన్నట్లుగా పల్లా రాజేశ్వర్ రెడ్డి చెప్పుకొచ్చారు. దీనిపై భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి. కార్యకర్తలకు ధైర్యం చెప్పుకోవాలంటే ఇది కాదేమో పద్ధతి అని కొంతమంది వ్యాఖ్యానిస్తున్నారు. అలా చెప్పకపోతే వారిలో కొంతమంది కాంగ్రెస్ వైపు చూస్తారనే ఆందోళన ఉందా అని ప్రశ్నిస్తున్నారు. కాగా... ఇటీవలే స్టేషన్ ఘనపూర్ లో బీఅరెస్స్ నుంచి గెలిచిన కడియం శ్రీహరి కూడా ఈతరహా వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా.. మరో ఆరు నెలలు లేదా ఏడాదిలో కేసీఆర్ తిరిగి సీఎం అవుతారని ఆయన చెప్పుకొచ్చారు. పూర్తి ఆధిక్యంతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో కడియం చేసిన వాక్యాలు తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. దీంతో... ప్రజలు మేన్ డేట్ ఇచ్చిన తర్వాత బీఆరెస్స్ నేతలు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఆత్మవంచనగా పలువురు ఈ సందర్భంగా అభిప్రాయపడుతుండగా.. కార్యకర్తలను వంచించొద్దంటూ మరికొందరు సూచిస్తున్నారు.






## ఐపీఎస్ అధికారి అంజనీకుమార్‌పై సస్పెన్షన్ ఎత్తివేత

హైదరాబాద్: తెలంగాణకు చెందిన ఐపీఎస్ అధికారి అంజనీకుమార్‌పై విధించిన సస్పెన్షన్‌ను కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) ఎత్తివేసింది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెల్లడైన సమయంలో రాష్ట్ర డీజీపీగా అంజనీకుమార్ ఉన్నారు. ఫలితాలు వెలువడుతున్నప్పుడు ఆయన రేవంత్‌రెడ్డిని వెళ్లి కలిశారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించారంటూ అంజనీకుమార్‌ను ఈసీ సస్పెండ్ చేసింది. దీనిపై ఈసీకి వివరణ ఇచ్చుకున్న ఆయన.. ఉద్దేశపూర్వకంగా ఎన్నికల కోడ్ ఉల్లంఘించలేదని తెలిపారు. ఎన్నికల ఫలితాల రోజు రేవంత్‌రెడ్డి పిలిస్తేనే వెళ్లానని.. మరోసారి ఇలా జరగదని అంజనీకుమార్ హామీ ఇచ్చారు. దీంతో ఆయన విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న ఈసీ.. సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి ఈసీ సమాచారం ఇచ్చింది.



# ఈ సారి హంగేనా...!?

## బిజెపికి అంత ఈజీ కాదా!!?

## 2024 ఎన్నికలు బిజెపికి పెను సవాలే!

కేంద్రంలో రెండు సార్లు వరుసగా మంచి మెజారిటీతో బీజేపీ గెలిచింది. ఒకసారి సాధారణ మెజారిటీ వస్తే 2019 ఎన్నికల్లో బీజేపీకి ఏకంగా మూడు వందల సీట్లు పై దాటి వచ్చాయి. ఇక 2024 లోక్ సభ ఎన్నికలు దగ్గరలో ఉన్నాయి. మరి ఈసారి బీజేపీ అదే మ్యాజిక్ కంటిన్యూ చేస్తుందా లేక మెజారిటీకి దూరంగా ఉండిపోతుందా అన్న చర్చ అయితే ఉంది. అయితే జాతీయ రాజకీయాల్లో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఇండియా కూటమి పెట్టి కాంగ్రెస్ జోరు చేస్తోంది. అదే విధంగా కాంగ్రెస్ గ్రాఫ్ కూడా బాగా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో బీజేపీకి ఈసారి ఎన్నికలు పెను సవాల్ ని విసురుస్తున్నాయి అని అంటున్నారు. దాంతో హోరా హోరీ పోరు సాగితే ఎవరికీ మెజారిటీ రాకుండా హంగ్ పార్లమెంట్ ఈసారి వస్తుందా అన్న చర్చలు అయితే సాగుతున్నాయి. దీని మీద దేశ రాజధాని ఢిల్లీలో జోరుగా ప్రచారం అయితే మొదలైంది. ఎందుకంటే బీజేపీ పూర్తిగా ఉత్తర భారతానికే పరిమితం అయిపోయింది. కర్నాటక ఎన్నికల్లో ఓటమితో బీజేపీకి దక్షిణాన సీట్లు వచ్చే అవకాశాలు కంపించడంలేదు. ఇక కాంగ్రెస్ చూస్తే దక్షిణాన స్ట్రాంగ్ అయిపోయింది. నిన్న కర్నాటక నేడు తెలంగాణా రాష్ట్రాలను తన ఖాతాలో వేసుకుని గట్టిగా నిలబడింది. ఇక తమిళనాడులో డీఎంకే మిత్రపక్షంగా ఉంది. కేరళలో వామపక్షాలు కాంగ్రెస్ కి సపోర్ట్ గా ఉంటాయి. దాంతో సౌతిండియాలో వచ్చే అత్యధిక శాతం ఎంపీలు ఈసారి ఇండియా కూటమి ఖాతాలో పడతాయని అంటున్నారు. అదే సమయంలో ఉత్తర భారతాన ఈ రోజుకీ కాంగ్రెస్ పట్టు సాధించలేకపోతోంది. బీజేపీ చూస్తే వరసగా ముఖ్యమంత్రులను మార్పు చేస్తూ బలమైన సామాజిక వర్గాలను దూరం చేసుకుని కర్నాటకలో అధికారం పోగొట్టుకుంది. ఇక తెలంగాణాలో చూస్తే కీలక సమయంలో సరైన నిర్ణయాలు తీసుకోలేక మంచి అవకాశాలను సైతం వాడుకోలేక అధికారం మాట అటుంచి డబుల్ డిజిట్ నంబర్ ని సైతం సాధించలేకపోయింది అని అంటున్నారు. తెలంగాణాలో బీజేపీకి ఈసారి ఊపు వచ్చినా కూడా తప్పుడు నిర్ణయాలతో కాలదన్నుకుంది అన్న భావన అయితే ఉంది. ఇక కేంద్రంలో బీజేపీకి ఈసారి పరిస్థితి ఇబ్బందిగా మారవచ్చు అని అంటున్నారు. దానికి కారణం దక్షిణాన ఉన్న మొత్తం 129 ఎంపీ సీట్లలో బీజేపీకి గట్టిగా సింగిల్ డిజిట్ నంబర్ అయినా వస్తుందా అన్నది ఇపుడు పెద్ద చర్చగా ఉంది. దాంతో 2019 మాదిరిగా ఉత్తర భారతం బీజేపీకి జై కొట్టినా సౌత్ లో మాత్రం బీజేపీకి అతి పెద్ద నష్టం తప్పకపోవచ్చు అంటున్నారు. దాని ఫలితంగా బీజేపీకి ఈసారి మెజారిటీకి సరిపడా సీట్లు అంటే 273 కి కనీసంగా ముప్పయి నుంచ్ నలభై సీట్ల దాకా తక్కువ పడతాయని అటున్నారు. అంటే బీజేపీ కానీ ఎన్డీయే కూటమి కానీ 230 దగ్గర ఆగిపోవచ్చు అని అంచనా కడుతున్నారు. అదే కనుక జరిగితే బీజేపీకి ఏ ప్రాంతీయ పార్టీ సమర్ధించే పరిస్థితి అయితే ఈసారి ఉండకపోవచ్చు అని అంటున్నారు.

ఇక కాంగ్రెస్ కి ఈసారి బాగానే సీట్లు వస్తాయని అంటున్నారు. ఈసారి వంద కంటే ఎక్కువ సీట్లు సొంతంగా కాంగ్రెస్ కి దక్కుతాయని అలాగే బలంగా ఉన్న ఇండియా కూటమిలోని వారికి కూడా పెద్ద ఎత్తున సీట్లు వస్తాయని అంటున్నారు. అయితే ఎవరికి సీట్లు దక్కినా మెజారిటీకి ఇండియా కూటమి కూడా దూరంగా ఉంటుంది అని అంటున్నారు ఈ నేపథ్యంలోనే ప్రాంతీయ పార్టీలు 2024 ఎన్నికల్లో తన హవాను చూపిస్తాయని అంటున్నారు. వారి మద్దతు ప్రధానంగా దేశంలోని జాతీయ పార్టీలైన బీజేపీకి కానీ కాంగ్రెస్ కి కానీ కావాల్సి ఉంటుంది అని అంటున్నారు. ఇక ఈసారి ఏపీలో టీడీపీకి వైసీపీకి కూడా సరిసమాంగా ఎంపీ సీట్లు వస్తాయని అంటున్నారు. అంటే మొత్తం పాతిక సీట్లలో ఇద్దరూ సరిగ్గా పంచుకుంటారు అని అంటున్నారు. అదే జరిగితే ఎవరి ఎవరికి మద్దతు ఇస్తారు అన్నది పెద్ద ప్రశ్న కూడా ఉంది. ఏది ఏమైనా బీజేపీకి జాతీయ స్థాయిలో ఈ సారి ఇబ్బందికరమైన పరిస్థితులు తలెత్తుతాయని అంటున్నారు. అదే సమయంలో హంగ్ పార్లమెంట్ ఈసారి తప్పనిసరి అని అంటున్నారు.

## సంపాదకీయం

# దేశంలో అధిక ద్రవ్యోల్బణంతో అతలాకుతలం

ప్రపంచాన్ని కుదిపేస్తున్న సమస్య ద్రవ్యోల్బణం. అమెరికా, ఆస్ట్రేలియా, బ్రెజిల్, భారత్ ఇలా పలు దేశాల్లో ద్రవ్యోల్బణం సమస్య అతలాకుతలం చేస్తోంది. ధనిక, పేద దేశాలనే తేడా లేకుండా ద్రవ్యోల్బణం నిరంతరం ఇబ్బందులకు గురి చేస్తూనే ఉంది. ఏదేశ చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం అన్నట్లు అన్ని దేశాలు ద్రవ్యోల్బణం బారిన పడి కొట్టుమిట్టాడుతున్నాయి. దీంతో వస్తువుల ధరలు అమాంతం పెరుగుతున్నాయి. కూరగాయలు, నిత్యావసర సరుకులు, డీజిల్, పెట్రోల్, గ్యాస్ ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఫలితంగా సామాన్యుడి బతుకు చిద్రమవుతోంది. స్టాక్ మార్కెట్లు ఒడిదుడుకుల మయం అవుతున్నాయి. దీని నుంచి గట్టెక్కడానికి పలు చర్యలు తీసుకుంటున్నా ఫలితాలు కనిపించడం లేదు. ప్రపంచ దేశాల్లో ద్రవ్యోల్బణం సమస్యతో సతమతమవుతున్నాయి. వెనుజులాలో ప్రపంచంలోనే అత్యధిక ద్రవ్యోల్బణం 318 శాతం ఉంది. లెబనాన్ లో 215, అర్జెంటీనాలో 143, సిరియాలో 79.1, పాకిస్తాన్ లో 29.2, భారత్ లో 4.87 శాతం ద్రవ్యోల్బణం నమోదైనట్లు తెలుస్తోంది. ఇంకా టర్కీలో 61, ఈజిప్టులో 35.8, నైజీరియాలో 27.33, కజకిస్తాన్ లో 10.3, బంగ్లాదేశ్ లో 9.93, రుమేనియాలో 8.07, హంగేరీలో 7.9, కెన్యాలో 6.8, రష్యాలో 6.7, పోలాండ్ లో 6.5, స్వీడన్ లో 6.5, దక్షిణాఫ్రికాలో 5.9, ఆస్ట్రేలియాలో 5.4, ఆస్ట్రియాలో 5.4, ఐర్లండ్ లో 5.1, ఫిన్లాండ్ లో 4.9 శాతం మేర ద్రవ్యోల్బణంతో బాధపడుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. దేశాల విధానాల వల్లే ద్రవ్యోల్బణం సమస్య తలెత్తుతుందని చెబుతున్నారు. ఈనేపథ్యంలో ద్రవ్యోల్బణం బారి నుంచి బయట పడటానికి చర్యలు తీసుకోవడం లేదు. ఫలితంగా ప్రజల జీవితాల్లో కూడా మార్పు రావడం లేదు. ఉచిత పథకాలు ప్రవేశపెట్టి ఆర్థిక వ్యవస్థను కుదేలు చేస్తున్నాయి. దీంతో అప్పుల భారం పెరుగుతోంది. ద్రవ్యోల్బణం పెరుగుతోంది. భవిష్యత్ లో ఈ సమస్య మరింత జటిలం అయ్యే అవకాశం ఉందని వ్యాపార నిపుణులు హెచ్చరిస్తున్నారు. ద్రవ్యోల్బణం వల్ల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. సామాన్యుడికి అందుబాటులో ఉండటం లేదు. వారి సంపాదన ఎటు చాలడం లేదు. ధరలు నియంత్రణలో ఉంటే సామాన్యుడి ఆదాయం పెరుగుతుంది. కానీ ధరలు అదుపులో లేకుంటే బతుకు దుర్భరమే. ఈనేపథ్యంలో ప్రభుత్వాలు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా ఫలితం మాత్రం కనిపించడం లేదు.

# ఈనెల 18న శీతాకాల విడిదికి హైదరాబాద్ రానున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

### రాష్ట్రపతి రాక నేపథ్యంలో అన్ని శాఖల వారు అప్రమత్తంగా ఉండాలి
### రాష్ట్రపతి శీతాకాల విడిది ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ గౌతమ్ సమీక్ష



జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజిగిరి (గరుడ వార్త) : భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శీతాకాల విడిదికై ఈనెల 18, న హైదరాబాద్ రానున్న నేపథ్యంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆయా శాఖల అధికారులు వారికి అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. రాష్ట్రపతి రాక నేపథ్యంలో డిసిపి శబరీష్ , అదనపు కలెక్టర్ విజయంద్ర రెడ్డి తో కలిసి జిల్లాలోని ఆయా శాఖల అధికారులతో మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ముందస్తు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ ఈనెల 18,న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శీతాకాల విడిదికి హైదరాబాద్ కి రానున్నారని తెలిపారు. రాష్ట్రపతి ప్రత్యేక విమానంలో జిల్లాలోని హకీంపేట ఎయిర్పోర్టుకు ముందుగా చేరుకొంటారని అక్కడ నుంచి బొల్లారంకు రోడ్డు మార్గం ద్వారా వెళ్తారని కలెక్టర్ అధికారులకు వివరించారు. ఈ నేపథ్యంలో హకీంపేట ఎయిర్ పోర్టులో రాష్ట్రపతి రాక సందర్భంగా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాల్సిందిగా అధికారులను ఆదేశించారు. రాష్ట్రపతి శీతాకాల విడిదికి వస్తున్నందున ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా అధికార యంత్రాంగం అవసరమైన జాగ్రత్తలు, చర్యలు తీసుకోవాలని అలాగే తిరిగి వెళ్ళే వరకు అప్రమత్తంగా ఉండాలని సమీక్ష సమావేశంలో కలెక్టర్ గౌతమ్, అధికారులకు అవసరమైన సూచనలు, ఆదేశాలు చేశారు. ఈ సమీక్ష సమావేశంలో డిసిపి శబరీష్ , జిల్లా అదనపు కలెక్టర్ విజయంద్ర రెడ్డి, తో పాటు జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, ఆర్డీవోలు రాజేష్ కుమార్ శ్యామ్ ప్రకాశ్, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ భూములు కబ్జా కాకుండా తగు చర్యలు..

### ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సిన బాధ్యత అధికారులదని విస్మరించొద్దు
### జిల్లాలోని రెవెన్యూ అధికారులుతో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్



జిల్లా బ్యూరో మేడ్చల్ -మల్కాజిగిరి (గరుడ వార్త) : జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ భూములు పరిరక్షించాల్సిన బాధ్యత అధికారులు తప్పకుండా తీసుకోవాలని ఈ విషయంలో వారికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని రకాలుగా సహకారం ఉంటుందని ఎక్కడ కూడా ప్రభుత్వ భూమి కబ్జా కాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఈ విషయంలో జిల్లాలోని అన్ని మండలాల తహాశీల్దార్లు తమ విధులను సజావుగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారిణి హరిప్రియ, ఆర్డీవోలు, జిల్లాలోని ఆయా మండలాల తహాశీల్దార్లతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ భూములు కబ్జాకు గురి కాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ప్రస్తుతం ఎక్కడైనా ప్రభుత్వ భూములు ఇతరుల స్వాధీనంలో ఉన్నట్లయితే వెంటనే నోటీసులు జారీ చేసి వాటిని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలన్నారు. జిల్లాలో ఎక్కడెక్కడ ప్రభుత్వ భూములు ఉన్నాయి అనే వివరాలను తెలుసుకొని వాటిని ఎవరైనా కబ్జా చేసినట్లయితే వెంటనే పోలీసు బలగాలతో సంబంధిత ప్రదేశంలో ప్రభుత్వ భూమి అని సూచించేలా బోర్డుతో పాటు కంచె ఏర్పాటు చేయాల్సిందిగా కలెక్టర్ గౌతమ్ తహాశీల్దార్లకు సూచించారు. ఈ విషయంలో ఎంతో జాగ్రత్తగా వ్యవహరించాలని ఇబ్బందులు తలెత్తకుండా ముందుస్తుగా కబ్జాలో ఉన్న వారికి సమాచారం అందించడంతో పాటు పోలీసు బలగాలతో అవసరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా కలెక్టర్ గౌతమ్ సమావేశంలో అధికారులను ఆదేశించారు. జిల్లాలో కబ్జాలు చేసిన వారు ఇబ్బందులకు గురి చేసినట్లయితే అధికారులు వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని రెవెన్యూ సంబంధిత అంశాలపై కలెక్టర్ గౌతమ్ తహాశీల్దార్లు, అధికారులను పూర్తి వివరాలు అడిగి తెలుసుకొన్నారు. ప్రభుత్వ భూములు ఎక్కడ కబ్జాకు గురైనా వాటిని ఆక్రమించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలోని రెవెన్యూ అధికారులతో ప్రతి పదిహేను రోజులకోసారి అన్ని విషయాలపై సమావేశాలు నిర్వహించడం జరుగుతుందని ఈ సందర్భంగా కలెక్టర్ గౌతమ్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆయా మండలాల తహాశీల్దార్లు, అధికారులు పలు సమస్యలను జిల్లా కలెక్టర్ గౌతమ్ దృష్టికి తీసుకురాగా... అందుకు సంబంధించిన విషయాల పై సానుకూలంగా స్పందించి వారి ఇబ్బందులు, సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని ఈ విషయంలో వారికి తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా కల్పించారు ప్రభుత్వంసూచనలు పాటిస్తూ తమ విధులు సక్రమంగా నిర్వహించి భూములు ఆక్రమించకుండా చూడాలని సమావేశంలో కలెక్టర్ గౌతమ్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు రాజేష్ కుమార్ శ్యామ్ ప్రకాశ్, జిల్లాలోని తహాశీల్దార్లు, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కాలువలు అధ్వానం.. ఆయకట్టు దయనీయం

ఆసిఫాబాద్: వరి పొలాలు నీళ్ల కోసం నెర్రలు తెరుస్తుండటంతో అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. జలాశయంలో నిండా నీరున్నా కాలువల్లో పూడిక తీస్తేనే చేన్లలోకి సాగునీరందే పరిస్థితి నెలకొనడంతో పంట రక్షణ కోసం అన్నదాతలు నడుం బిగించారు. ఊరంతా కాలువల బాటపట్టారు. నాలుగు రోజులుగా పూడికను తొలగిస్తున్నారు కుమురం భీం జిల్లా వట్టివాగు ఆయకట్టు రైతులు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేకపోవడంతో స్వయంగా కాలువలు శుభ్రం చేసుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. రెండు టీఎంసీల సామర్థ్యం ఉన్న వట్టివాగు ప్రాజెక్టు 25 వేల ఎకరాలకు సాగునీరు అందించాలి. ఏటా కాలువల ఒడ్డున ఉన్న మట్టి కూలిపోవడం, విపరీతంగా తుంగ పేరుకుపోవడంతో 1000 ఎకరాలకు సైతం నీరందడం లేదు. ఏటా భారీ వర్షాలకు పెద్దఎత్తున మట్టి కాలువలో చేరుతోంది. దీనికితోడు తుంగ పెరిగి నీరు విడుదల చేసినా.. పొలాల వరకు చేరుకునే పరిస్థితి లేదు. ఈసారి ఎండలు మండుతుండటంతో వరి పొలాలు ఎండిపోతున్నాయి. అధికారుల నుంచి స్పందన లేకపోవడంతో రెబ్బెన మండలంలోని నక్కలగూడ, పుంజుమేరగూడ, రెబ్బెన, పర్సనంబాల రైతులు నాలుగు రోజుల నుంచి కాలువల్లో పూడికను



తీస్తున్నారు. పలుగు, పార చేతపట్టి కాలువల్లోని మట్టిని తీస్తున్నారు.

విధుల్లోకి రాని లష్కర్లు

వీఆర్ఏల క్రమబద్ధీకరణలో తొమ్మిది మందిని లష్కర్లుగా నియమించినా, విధుల్లోకి ఎవరూ వెళ్లడం లేదు. వారిలో ఇద్దరిని కలెక్టర్ హేమంత్ బోర్కడే ఎన్నికల విధులకు కేటాయించారు. రిలీవ్ కాకముందే ఈ విధంగా కేటాయించడం పట్ల సంబంధిత అధికారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. గతంలో లష్కర్లుగా ఉన్న 11 మందికి రెండేళ్లుగా వేతనాలు ఇవ్వలేదు. అధికారులు స్పందించి తుంగ, పూడిక తీసి ఎండుతున్న వరి పొలాలను కాపాడాలని రైతులు వేడుకుంటున్నారు.

# మురుగు కాలువల నిర్మాణం జరిగేనా!

గోదావరిఖని : ప్రధాన మురుగు కాలువల నిర్మాణంలో బల్దియా నిర్లక్ష్యం ఆక్రమణదారులకు వరంగా మారుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నగరంలోని వివిధ ప్రాంతాల్లోని ప్రధాన మురుగు కాలువలు కబ్జాకు గురవుతున్నాయి. గతంలో మార్కండేయకాలనీలో కాలువను మళ్లించి కట్టడాలు చేపట్టగా ఇటీవల ఎన్టీఆర్ నగర్‌లో కాలువ నిర్మాణం వివాదాస్పదంగా మారింది. ఇందిరానగర్ నుంచి మార్కండేయకాలనీ, సప్తగిరి కాలనీ మీదుగా గోదావరిలోకి ప్రవహించే ప్రధాన మురుగు కాలువ కబ్జాలతో అక్కడక్కడా పిల్ల కాలువగా మారింది. నగరపాలక ప్రణాళికలో ఉన్నట్లుగా కాలువను వెడల్పు చేయడంతో పాటు నిర్మాణం చేపట్టేందుకు పాలకవర్గ తీర్మానం చేసినా ప్రయోజనం చేకూరడం లేదు. నగర ప్రజాప్రతినిధులు కాలనీల్లో రహదారులు, భూగర్భ మురుగు కాలువల నిర్మాణంపై దృష్టి సారించడం మినహా ప్రధాన మురుగు కాలువలను పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

గుత్తేదారు జాప్యం...మార్కండేయకాలనీలోని ప్రధాన మురుగు కాలువ నిర్మాణానికి సుమారు రెండేళ్ల క్రితం టెండర్లు నిర్వహించి గుత్తేదారునకు పని అప్పగించినప్పటికీ చేపట్టడం లేదు. దీంతో క్రమక్రమంగా ఈ కాలువకు ఇరువైపులా ఉన్నవారు కొందరు కాలువ స్థలాన్ని ఆక్రమించుకుంటున్నారు. సదరు గుత్తేదారు నిర్లక్ష్యాన్ని నగరపాలిక పట్టించు



కోవడం లేదు. కాలువ నుంచి వచ్చే దుర్గంధంతో పక్కనే ఉన్నవారు రోగాల బారిన పడుతున్నారు. వరద కోతతో గోడలు కూలిపోతాయేమోనని ఆయా ప్రాంతవాసులు ఆందోళనకు గురవుతున్నారు. మార్కండేయకాలనీకి పైభాగాన గతంలో ఈ కాలువను మళ్లించి కట్టడాలు చేపట్టారు. రామగుండం ఎరువుల కర్మాగారం వ్యర్థ జలాలతో పాటు ఇందిరానగర్ నుంచి మొదలుకొని ఆయా కాలనీల్లోని వరదనీరంతా ఈ కాలువద్వారానే గోదావరిలోకి వెళుతోంది.

ప్రహరీ నిర్మించడం.. కూల్చడం

ఇందిరానగర్‌లోని ఈ మురుగు కాలువను తరచూ ఆక్రమించుకునేందుకు ప్రయత్నాలు సాగుతుండగా ఎప్పటికప్పుడు నగరపాలక అధికారులు అడ్డుకొని కాలువను వెడల్పు చేస్తుంటారు. ఓ దశలో కాలువ నిర్మాణానికి బల్దియా ప్రణాళికలు సిద్ధం చేసినా ఆచరణకు నోచుకోవడం లేదు. కాలువకు ఓ వైపున కొందరు ఇది తమ స్థలమంటూ పలుమార్లు ప్రహరీ నిర్మించడం, నగరపాలిక దానిని కూల్చడం జరిగింది. కాలువ నిర్మాణం చేపడితే ఆక్రమణలకు అవకాశం ఉండదు.

ఖాళీ స్థలాల్లో మడుగులు

టీచర్స్ కాలనీ పక్కనుంచి ప్రవహించే ప్రధాన మురుగు కాలువ ఇది. మొదట్లో కాలువ విశాలంగా ఉన్నా కిందికి వెళ్లే సరికి కబ్జాల కారణంగా కుచించుకుపోయింది. రాజీవ్ రహదారి దాటాక ఇందులో నాలుగోవంతు వెడల్పు సైతం లేదు. ఇరువైపులా ఆక్రమణలున్నాయి. వర్షాకాలంలో వరద నీరు ఒక్కసారిగా వెళ్లక పోవడంతో టీచర్స్ కాలనీ ముందున్న జీవితబీమా సంస్థకు చెందిన ఖాళీ స్థలంలో నీరునిలిచి చెరువును తలపిస్తోంది. సాయినగర్, టీచర్స్ కాలనీ, కేసీఆర్ కాలనీ, ప్రగతినగర్, పద్మావతి కాలనీ తదితర ప్రాంతాల నుంచి వరద, మురుగు నీరంతా ఈ కాలువ ద్వారానే గోదావరిలోకి వెళుతోంది. పందులు, దోమల బెడద తీవ్రంగా ఉంది.

కాలువలో విరిగిపడుతున్న చెట్లు

ప్రభుత్వ వైద్య కళాశాల ప్రధాన రహదారి నుంచి సప్తగిరి కాలనీ మీదుగా వచ్చే మురుగు గోదావరిలో కలుస్తోంది. కాలువకు ఇరువైపులా ఉన్న చెట్లు తరచూ కాలువలో విరిగి పడుతున్నాయి. దీంతో వరద ప్రవాహం నిలిచిపోతోంది. ఆయా ప్రాంతవాసులు దుర్గంధం భరించలేక పోతున్నారు. సప్తగిరి కాలనీలో కబ్జాకు ప్రయత్నాలు సాగుతున్నాయి. నగర సగభాగం నుంచి మురుగు, వరద ఈ కాలువ ద్వారానే గోదావరికి చేరుతుంది. భారీ వర్షాలు కురిసినప్పుడు ఈ ప్రాంతం ముంపునకు గురవుతుంది.

# అభయహస్తం

సంగారెడ్డి : శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల తొలి జాబితాను కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. జిల్లాలో అయిదు నియోజకవర్గాలు ఉన్నాయి. సంగారెడ్డి, జహీరాబాద్, అందోలు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించగా.. పటాన్‌చెరు, నారాయణఖేడ్‌లో ఎవరు బరిలో నిలుస్తారనే విషయమై సందిగ్ధం నెలకొంది.

సంగారెడ్డి బరిలో జగ్గారెడ్డి

సంగారెడ్డి నియోజకవర్గ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి పేరును ఆ పార్టీ అధిష్ఠానం ప్రకటించింది. ఆయన 2004లో తెరాస(భారాస) నుంచి పోటీ చేసి విజయం సాధించారు. తర్వాత కాంగ్రెస్‌లో చేరారు. 2009లో కాంగ్రెస్ నుంచి గెలిచి ప్రభుత్వ విప్‌గా పని చేశారు. 2014లో చింతా ప్రభాకర్ చేతిలో ఓటమి పాలయ్యారు. 2018లో తెరాస(భారాస) అభ్యర్థి చింతా ప్రభాకర్‌పై విజయం సాధించారు.

అందోలు: దామోదర మరోసారి..అందోలు అసెంబ్లీ స్థానం నుంచి మరోసారి పోటీ చేయడానికి దామోదర రాజనర్సింహ పేరును కాంగ్రెస్ అధిష్ఠానం ప్రకటించింది. ఎస్సీ రిజర్వుడు స్థానమిది. 1989లో ఇక్కడి నుంచి దామోదర పోటీ చేసి విజయం సాధించారు. 1994, 1998(ఉప ఎన్నిక), 1999 ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. 2004లో విజయం సాధించి మార్కెటింగ్ శాఖ మంత్రిగా, 2009లో గెలిచి ఉప ముఖ్యమంత్రిగా, సాంకేతిక విద్యాశాఖ మంత్రిగా సేవలందించారు. 2014, 2018లో ఓటమి పాలయ్యారు.

జహీరాబాద్: చంద్రశేఖర్‌కు టికెట్

జహీరాబాద్ అసెంబ్లీ స్థానం నుంచి కాంగ్రెస్ తరఫున చంద్రశేఖర్ పోటీ చేయనున్నారు. ఆయన వికారాబాద్ స్థానం నుంచి 1985లో తెదేపా తరఫున పోటీచేసి విజయం సాధించారు. 1989, 1994, 1999లోనూ గెలిచి అప్పటి తెదేపా ప్రభుత్వంలో మంత్రిగా పనిచేశారు. 2004లో తెరాస(భారాస) తరఫున బరిలో నిలిచి విజయం సాధించారు. 2008లో జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి జి.ప్రసాద్‌కుమార్ చేతిలో ఓటమి పాలయ్యారు. అనంతరం భాజపా, ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరారు. మాజీ మంత్రి గీతారెడ్డి జహీరాబాద్ నుంచి పోటీ చేయడం లేదని స్వచ్ఛందంగా ప్రకటించడంతో.. కాంగ్రెస్ పార్టీ చంద్రశేఖర్‌కు అవకాశం కల్పించింది.

రెండు స్థానాలపై కొనసాగుతున్న కసరత్తు నారాయణఖేడ్ నుంచి మాజీ ఎంపీ సురేశ్ షెట్కార్, పీసీసీ ఉపాధ్యక్షుడు సంజీవరెడ్డి కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్నారు.

# పనులు పూర్తి కాకుండానే కార్యాలయ నిర్వహణ

పెద్దపల్లి: పెద్దపల్లి బల్దియా భవన నిర్మాణం పూర్తి కాకుండానే కార్యాలయాన్ని నిర్వహిస్తుండటం స్థానికంగా చర్చనీయాంశమైంది. జిల్లాకేంద్రంలో రూ.3.50 కోట్లతో చేపట్టిన పురపాలిక భవన నిర్మాణం ముందుకు పడటం లేదు. గడిచిన పదేళ్లలో ఇద్దరు మంత్రులు భూమిపూజ నిర్వహించినా ఇప్పటికీ పనులు పూర్తి కాలేదు. 2013లో మంత్రి శ్రీధర్‌బాబు, భారాస అధికారంలోకి వచ్చిన అనంతరం మంత్రి కేటీఆర్ భవనం నిర్మాణ శిలాఫలకాలు ఆవిష్కరించారు. ఆ తర్వాత వివిధ సాంకేతిక సమస్యలను అధిగమించి నిర్మాణం చేపట్టారు. అయితే పనులు పూర్తి కాకుండానే గత అక్టోబరులో ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ప్రారంభించినట్లు మినీ ట్యాంక్‌బండ్ వద్ద శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ క్రమంలో మూడు రోజుల కిందట మున్సిపల్ కార్యాలయాన్ని కొత్త భవనంలోకి మార్చారు. మూడు గదులకు గోడలు కట్టి, నామమాత్రంగా ఫ్లోరింగ్ పూర్తి చేసిన గదుల్లో కమిషనర్, రెవెన్యూ, ఇంజినీరింగ్ విభాగాలను ఏర్పాటు చేశారు. మిగతా సిబ్బంది గోడలు లేని వరండాలోనే విధులు నిర్వహిస్తున్నారు. కార్యాలయం చుట్టూ గ్రీన్ నెట్ కట్టి నిర్వహణ ప్రక్రియను మమ



అనిపించారు. నిజానికి మూడొంతస్తులుగా నిర్మించిన భవనంలో గోడల కట్టడం పూర్తి కాకుండానే కార్యాలయాన్ని తరలించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై కమిషనర్ ఆకుల వెంకటేశ్‌ను వివరణ కోరగా అద్దె భవనంలోని కార్యాలయానికి వచ్చే సందర్శకులు రెండంతస్థులు ఎక్కి రావడానికి ఇబ్బందులు పడుతుండటం, పార్కింగ్ సమస్య తదితర కారణాలతో కొత్త భవనంలో సర్దుబాటు చేసినట్లు తెలిపారు.

# రేషన్ కార్డుల నిరీక్షణకు తెరపడేనా?




సిరిసిల్ల: రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీ పథకాల అమలుకు రేషన్ కార్డులు కీలకం కానున్నాయి. ఆయా పథకాలకు లబ్ధిదారుల ఎంపికకు వీటినే ప్రామాణికంగా తీసుకోనున్నారు. ఈ క్రమంలో కొత్త కార్డుల జారీ, కుటుంబ సభ్యుల మార్పులు, చేర్పులు తదితర అంశాలపైనే ప్రజల్లో ప్రధాన చర్చ సాగుతోంది. పదేళ్లలో కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ నిలిచిపోయింది. అప్పటి నుంచి వీటికి అర్హులైన కుటుంబాల సంఖ్య భారీగా పెరుగుతూ వస్తోంది. 2014లోని ఏఏపీ కార్డులను రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఆహార భద్రత కార్డులుగా మార్చారు. కాగా ఆధార్ అనుసంధానం, పేర్లలో తప్పుల సవరణ తదితర కారణాలతో సవరించుకున్నవారి రేషన్ కార్డులు జాబితాలో లేకుండా పోయాయి. దానికి సంబంధించిన వివరాలు స్థానిక రెవెన్యూ కార్యాలయాల్లోనూ అందుబాటులో లేకపోవడంతో వివిధ పథకాలకు అర్హులైనవారు చాలా మంది ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ ప్రారంభిస్తుందన్న ఆశలు అర్హుల్లో చిగురిస్తున్నాయి. సన్న బియ్యం పంపిణీతోపాటు ఇందిరమ్మ ఇళ్లు, విద్యార్థులకు విద్యాభరోసాలో రూ.5 లక్షలు, రాజీవ్ ఆరోగ్యశ్రీలో రూ.10 లక్షల బీమా, మహాలక్ష్మి వంటివి వర్తించాలంటే రేషన్ కార్డులు తప్పనిసరి కానున్నాయని చెబుతున్నారు.

వేలల్లో అర్హులు జిల్లాలో 5,00,562 కుటుంబాలు ఉండగా వారిలో 1,74,050 కుటుంబాలకు రేషన్ కార్డులున్నాయి. 2019 వరకు పౌర సరఫరాలశాఖకు 39 వేల దరఖాస్తులు అందాయి. 2021 ఆగస్టులో 2 వేల కుటుంబాలకు మాత్రం కొత్త కార్డులు అందించారు. చాలా కుటుంబాలకు ఇంటింటి సర్వే చేపట్టినట్లు చెప్పిన అధికారులు ఎంత మందిని లబ్ధిదారులుగా గుర్తించారు, తిరస్కరించినవి ఎన్ని, వాటికి కారణాలు మాత్రం చెప్పలేదు. ఒకే కుటుంబానికి చెందిన వారు వివాహాల తర్వాత విడిగా ఉంటున్నారు. ఇలాంటి కుటుంబాలు రేషన్ కార్డులు కావాలని దరఖాస్తు చేసుకున్నాయి. ఉమ్మడి కుటుంబంలో పేరును తొలగించినప్పటికీ కొత్త కార్డు మాత్రం ఇప్పటికీ జారీ కాలేదు. ఇలాంటి వారు జిల్లా వ్యాప్తంగా వేలల్లో ఉన్నారు. ఒక కుటుంబంలో ఎవరైనా చనిపోతే వారి పేరును మాత్రం నెల రోజుల్లో తొలగిస్తున్నారు. అదే క్రమంలో పుట్టినవారి పేర్ల నమోదుకు మాత్రం అవకాశం లేదు. ఆధార్ కార్డులో పేర్లు సవరించుకున్నవారు రేషన్ కార్డుల్లోనూ మార్చుకునే అవకాశం కల్పించలేదు. పైగా కొన్ని నెలలకు రేషన్‌కార్డుల జాబితాలో వారి పేరు లేకుండా పోతోంది. బయోమెట్రిక్ పని చేయక, ఈ పాస్‌లో వేలిముద్ర సరిగా పడకపోయినా రెండు నెలల తర్వాత రేషన్ జాబితాలో పేరు లేకుండా పోతోంది. ఇప్పటికైనా అర్హులైన వారికి కొత్త కార్డులు జారీ చేస్తారనే ఆశతో ఉన్నారు.

అయిదేళ్లుగా ఎదురుచూస్తున్నాంనేను 2013లో ఉపాధి కోసం దుబాయ్ వెళ్లాను. ఆ సంవత్సరం నా భార్య, పెద్ద కుమారుడి ఫొటో తీసుకుని రేషన్ కార్డు జారీ చేశారు. అప్పుడు నేను లేకపోవడంతో కార్డులో నా పేరు రాలేదు. 2018లో తిరిగి గ్రామానికి వచ్చాను. చిన్న కొడుకుతో పాటు నా పేరు చేర్చాలని అప్పటి నుంచి మీ సేవా కేంద్రం, తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా. ప్రభుత్వం నుంచి ఆదేశాలు లేవంటూ తిప్పి పంపుతున్నారు. ఇప్పటికైనా కార్డులు మంజూరు చేయాలి.ముంద్రాయి సందీప్ కుమార్, మర్తనపేట

మార్గదర్శకాలు రాలేదుకొత్త రేషన్ కార్డులపై ప్రభుత్వం నుంచి ఎలాంటి మార్గదర్శకాలు రాలేదు. దరఖాస్తు చేసుకున్నవి ఏవీ పెండింగ్‌లో లేవు. కార్డులో కొత్తగా పేర్లు చేర్చేందుకు పది వేల దరఖాస్తులు వచ్చాయి. అవి మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి.జితేందర్‌రెడ్డి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

# ప్రభుత్వ రుణం.. ఉపాధికి ఊతం

భువనగిరి : ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకుంటూ పలువురు స్వయం ఉపాధిని పొందుతున్నారు. నిరుపేదల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అమలు పరిచిన ప్రైమ్ మినిస్టర్ అనుసూచిత్ జాతి అభ్యుదయ యోజన(పీఎం అజయ్), రాష్ట్ర ప్రభుత్వం అమలు పరిచిన దళితబంధు పథకాలతో దళితులు స్వయం ఉపాధికి బాటలు వేసుకున్నారు. ప్రభుత్వం అందించిన రుణాలు, ఆర్థిక సహాయంతో పలు యూనిట్లను ఏర్పాటు చేసుకుని తాము ఉపాధి పొందడంతో పాటు పరోక్షంగా పలువురికి ఉపాధిని కల్పిస్తున్నారు. కొందరు వ్యాపారాలతో ఎదుగుతూ లాభాలు గడిస్తుండగా మరికొందరు కుటుంబానికి ఆర్థికంగా ఆసరాగా నిలుస్తున్నారు.

పీఎం అజయ్‌తో స్వయం ఉపాధి...

దళితు కుటుంబాల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అమలు పరిచిన ప్రైమ్ మినిస్టర్ అనుసూచిత్ జాతి అభ్యుదయ యోజన పథకం కింద జిల్లా వ్యాప్తంగా 28 యూనిట్లు మంజూరయ్యాయి. కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని 2021-22 ఆర్థిక సంవత్సరంలో ప్రారంభించింది.



రూ.లక్ష నుంచి రూ. 8లక్షల వరకు యూనిట్లకు రాయితీతో కూడిన రుణం అందించింది. రూ.లక్ష రుణం 80 శాతం రాయితీ, రూ.2 లక్షలకు 60 శాతం రాయితీ, రూ.8 లక్షలకు రూ.5లక్షలు మించకుండా రాయితీతో కూడిన బ్యాంకు రుణం ప్రభుత్వం మంజూరు చేసింది. రూ.లక్షతో టైలరింగ్, కిరాణ దుకాణం, రూ.5 లక్షలతో దళిత న్యాయవాదులకు పుస్తకాలు, వృత్తిలో రాణించేందుకు ఆర్థిక సహాయం, రూ.8 లక్షలతో టిఫిన్ సెంటర్, మొబైల్ మటన్ వాహనాలు అందించారు. ఆయా యూనిట్లతో లబ్ధిదారులు ఆవాస ప్రాంతాల్లో వ్యాపారాలు నిర్వహిస్తూ ఉపాధి పొందుతున్నారు.

దళితబంధుతో ప్రయోజనం

దళితబంధు పథకం జిల్లాలో 2021 నుంచి ప్రారంభించింది. ఇప్పటి వరకు జిల్లాలో 413 మంది దళితులను లబ్ధిదారులుగా ఎంపిక చేసి వారికి రూ.41.30 కోట్లు మంజూరు చేయడంతో పలు యూనిట్లతో లబ్ధి పొందుతున్నారు. హార్వెస్టర్లు, ట్రాక్టర్లు, రవాణా, ప్రయాణికుల వాహనాలు, ఏజెన్సీలు, పౌల్ట్రీ ఫాంలు, డెయిరీ, గొర్రెల ఫాంలు ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా ఎదుగుతున్నారు. కొందరు లబ్ధిదారులు గతంలో మంజూరు చేసిన యూనిట్లను విక్రయించుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మంజూరు అనంతరం యూనిట్ల నిర్వహణపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ప్రజాధనం దుర్వినియోగం అయిందన్న ఆరోపణలు ఉన్నాయి. కొందరు యూనిట్లను జీవనాధారంగా చేసుకుని వ్యాపారంలో రాణిస్తున్నారు.

# గ్రామాల్లో అక్రమాలకు చెక్..!

మునుగోడు : పంచాయతీ పరిధిలో ఇంటి నిర్మాణం, ఇతర అనుమతుల కోసం గతంలో మ్యాన్‌వల్‌గా ఇస్తే దాంతోనే అమలయ్యేది. నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు పొందినా అవీ చెల్లుబాటు అయ్యేవి. దీని కారణంగా ప్రభుత్వ నిబంధనలు తప్పుదోవ పట్టేందుకు వీలుండేది. అంతేకాకుండా పంచాయతీకి సంబంధించిన ఆదాయ, ఖర్చు వివరాలను తెలుసుకోవాలంటే పంచాయతీ కార్యాలయానికి వెళ్లి అధికారుల వద్ద నుంచి ఆరా తీయాల్సి వచ్చేది లేదా సమాచార హక్కు చట్టం ద్వారా సేకరించేందుకు వీలుండేది. దీంతో వారు ఇచ్చే సమాచారంతో ఎలాంటి లోటుపాట్లు సైతం తెలియని పరిస్థితి ఉండేది. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకున్న కేంద్ర ప్రభుత్వం ఈ-గ్రామ స్వరాజ్ యాప్‌ను మూడేళ్ల కిందట అందుబాటులోకి తెచ్చింది. ఈ యాప్ ద్వారా పంచాయతీ పూర్తి సమాచారం సులువుగా తెలుసుకునేందుకు వెసులుబాటు కల్పించింది. ఈ యాప్‌లో ప్రతి లెక్క పక్కాగా పొందుపర్చాల్సిందే. దీనిపై చాలా మంది ప్రజలకు అవగాహన లేకపోవడంతో పంచాయతీ ఆదాయ, వ్యయ ఖర్చుల వివరాలను తెలుసుకోలేకపోతున్నారు.

తప్పులకు తావులేకుండా..

పంచాయతీ వివరాలను ఎప్పటికప్పుడు యాప్‌లో అప్‌లోడ్ చేయడంతో పారదర్శకంగా అమలవుతుంది. కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సంఘం నిధులు ఎన్ని విడుదల చేయాల్సి ఉంటుందో ఇట్టే తెలిసిపోతుంది. పాలకవర్గాలు పొరపాట్లకు తావులేకుండా ప్రతి పైసాను లెక్క




ప్రకారంగా ఖర్చు చేసేందుకు అవకాశం ఉంటుంది. ఏమైనా తప్పుడు నివేదికలు చూపిస్తే ఈ-గ్రామస్వరాజ్ యాప్ ద్వారా ప్రశ్నించవచ్చు.

సులువుగా తెలుసుకోవడం ఇలా...

చరవాణిలోని ప్లేస్టోర్‌లో 'ఈ-గ్రామస్వరాజ్' అనే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది. డౌన్లోడ్ అయిన తర్వాత అది ఓపెన్ చేస్తే రాష్ట్రం, జిల్లా, మండలం, గ్రామం ఎంపిక చేసుకోవాలి. ఆ తర్వాత అందులో పూర్తి సమాచారం క్లుప్తంగా నమోదై ఉంటుంది. వీటిద్వారా పూర్తి సమాచారాన్ని తెలుసుకునేందుకు వీలుంది.

వివరాలిలా..

ప్రతి పంచాయతీకి సంబంధించిన గ్రామ అభివృద్ధి, ఆర్థిక పురోగతి, ఆస్తుల నిర్వహణ, జియో ట్యాగింగ్ లాంటి వివరాలను యాప్‌లో నిక్షిప్తంగా పొందుపర్చాల్సి ఉంటుంది. గ్రామ పాలకమండలి పేర్లతో సహా వివరాలు, పంచాయతీ కార్యదర్శి వివరాలు, నిధుల మంజూరు, ఏయో పనులకు ఎంత ఖర్చు చేశారు, పనుల పురోగతి వంటి అంశాలు సైతం ఉంటాయి. వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన అంచనా వ్యయాలు, అభివృద్ధి పనుల నివేదికలు యాప్‌లో క్లుప్తంగా కనిపిస్తాయి. జీపీఆర్ఎస్ ద్వారా గుర్తించడంతో ఒక్కసారి చేసిన పనులకు మరోసారి బడ్జెట్ కేటాయించడానికి వీలుండదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక సంఘం నిధుల వివరాలు, ఎన్ని పనులకు ఎంత ఖర్చు చేశారో.. కార్మిక, సిబ్బంది వేతనాలు ఇతర ఖర్చులు వంటి సమాచారం సైతం ఇందులో పొందుపరుస్తున్నారు. ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా పకడ్బందీగా ఈ-గ్రామస్వరాజ్ యాప్ ద్వారా అమలు చేస్తున్నారు.

# బాలికలకు భరోసా



ఆలేరు : బాలికల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. ఈ క్రమంలోనే పాఠశాలల వారీగా బాలికల సాధికారత సంఘాలు ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. బాలికలపై పెరుగుతున్న దాడులు, అత్యాచారాలకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా కమిటీలు పని చేయనున్నాయి. జిల్లాస్థాయిలో సమగ్ర శిక్ష అధికారులు ఆయా ప్రధానోపాధ్యాయులకు ఈ మేరకు ఇటీవల ఆదేశాలు జారీ చేయడంతో పాటు.. నిబంధనలు సంబంధిత వివరాలు ప్రకటించారు.

లింగ సమానత్వంపై అవగాహన..

ఉమ్మడి నల్గొండ జిల్లాలోని 617 ఉన్నత పాఠశాలల్లో సుమారుగా 1.60 లక్షల మంది బాలికలు విద్యను అభ్యసిస్తున్నారు. విడతల వారీగా ఆయా పాఠశాలల్లో బాలికా సాధికారత కమిటీలు ఏర్పాటు చేసేందుకు అధికారులు కసరత్తు మొదలెట్టారు. ప్రతి తరగతి నుంచి సెక్షన్ల వారీగా ఇద్దరు విద్యార్థినులతో పాటు ఒక ఉపాధ్యాయురాలు, ప్రధానోపాధ్యాయులతో కూడిన కమిటీ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఈ కమిటీ సదరు పాఠశాలలో ప్రతినెలా విద్యార్థినులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నారు. కౌమార దశలో బాలికలకు వచ్చే మార్పుల గురించి తెలియజేస్తారు. లింగ సమానత్వంపై ప్రత్యేక శిక్షణ ఇస్తారు. బాల్య వివాహాలు నిరోధించడం, బాలికల హక్కులపై అవగాహన కల్పిస్తారు. ఎక్కడైనా వేధింపులకు గురైతే సత్వరం స్పందించి ఫిర్యాదు చేసేలా భరోసా కల్పిస్తారు.

అవసరాన్ని బట్టి పోలీసుల సహకారం..

పాఠశాలల్లో చదివే బాలికల్లో ఆత్మ విశ్వాసం కల్పించేందుకు పోలీసులతో కలిసి పని చేసేలా అవగాహన కల్పిస్తారు. లైంగిక వేధింపులు, దూషణలు, బెదిరింపులు, ఈవ్‌టీజింగ్, అనుచిత ప్రవర్తన, తదితర ఘటనలు జరిగినప్పుడు బాలికలు భయపడకుండా ధైర్యంగా ఫిర్యాదు చేసి రక్షణ పొందేలా చైతన్యపరుస్తారు. ఈ విషయంలో పాఠశాలలు స్థానిక పోలీసులకు వారధిగా పనిచేయాలనేది ఈ విధానం ప్రధాన లక్ష్యం.

కమిటీలో సభ్యుల ఏర్పాటు ఇలా..

అధ్యక్షుడిగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, కన్వీనర్‌గా మహిళా ఉపాధ్యాయురాలు, సభ్యులుగా ప్రతి తరగతిలోని ఇద్దరు బాలికలు ఉండనున్నారు. ఎక్స్‌టర్నల్ సభ్యులుగా స్థానిక పోలీస్‌స్టేషన్‌కు చెందిన మహిళా కానిస్టేబుల్, షీటీం ఇన్‌ఛార్జి ఉండాల్సి ఉంది. జిల్లా స్థాయి కమిటీకి పాలనాధికారి అధ్యక్షులుగా ఉంటారు. ఇందులో సభ్యులుగా జిల్లా విద్యాధికారి, ఐసీడీఎస్ జిల్లా అధికారితోపాటు జిల్లా బాలికల అభివృద్ధి అధికారి వ్యవహరించనున్నారు. మొత్తంగా బాలికల్లో మనోధైర్యం పెంచుకోవడం, సమస్యల పరిష్కారం దిశగా అడుగులు వేసేందుకు ఈ కమిటీలు దోహదపడనున్నాయి.

# నిధులున్నా.. వసతుల్లేవ్

కోదాడ : గ్రంథాలయాల అభివృద్ధికి ప్రభుత్వం ఇంటి పన్నులో 8 శాతం నిధులు కేటాయిస్తోంది. కేటాయించిన నిధులు పారదర్శకంగా ఖర్చు చేయట్లేదనే ఆరోపణలు ఉన్నాయి. కనీస వసతులు కరవవడంతో నిత్యం గ్రంథాలయాలకు వచ్చే పాఠకులు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు ఇబ్బందులు పడుతున్నారు. కోదాడ పట్టణంలో పురపాలక సిబ్బంది గ్రంథాలయం కోసం వసూలు చేసిన నిధులు 2014 నుంచి 2022-23 ఆర్థిక సంవత్సరం వరకు సుమారు 1.41 కోట్లు. ఆ నిధులను జిల్లా గ్రంథాలయానికి జమ చేశామని పుర కమిషనర్ తెలిపారు. కానీ కోదాడ గ్రంథాలయంలో దినపత్రికలు, విద్యుత్తు బిల్లు మాత్రమే చెల్లిస్తున్నారని, వాటికి రూ.10 లక్షల ఖర్చు కూడా కాదని, మిగతా డబ్బులు ఏమయ్యాయని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

దినపత్రికలకే ఖర్చు: జిల్లా వ్యాప్తంగా 18 గ్రంథాలయాలు ఉన్నాయి. వీటి నిర్వహణ కోసం స్థానిక సంస్థలు, పురపాలికల్లో ఇంటి పన్నుల్లో 8 శాతం కేటాయిస్తున్నారు. కానీ వసూలు చేసిన నిధుల్లో 50 శాతం సైతం ఆయా గ్రంథాలయ పరిధిలో ఖర్చు చేయకపోవడం గమనార్హం. పోటీ పరీక్షల కాలం నడుస్తుండటంతో గ్రంథాలయాల్లో అభ్యర్థులకు దాతల ద్వారా వచ్చిన పుస్తకాలు, ఫ్యాన్లు, స్టడీ ఛైర్లు ఉన్నాయి. ప్రభుత్వం కేవలం దినపత్రికలకే ఖర్చు చేస్తోంది. ఇప్పటికైనా గ్రంథాలయ అధికారులు దృష్టి సారించి మౌలిక వసతులు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.వరండాలో అభ్యర్థులు చదువుతున్న ఈ చిత్రం కోదాడలోని బాపూజీ గ్రంథాలయంలోనిది. ఇక్కడికి నిత్యం 100 మంది అభ్యర్థులు వచ్చి చదువుతుంటారు. వారికి మౌలిక వసతులైన మరుగుదొడ్లు,



స్టడీ ఛైర్లు, ఫ్యాన్లు, పుస్తకాలు లేని పరిస్థితి ఇక్కడ ఉంది. గ్రంథాలయంలో గోడలు పాతబడి ఉండటం, పెచ్చులూడుతుం డటంతో అనుక్షణం భయపడాల్సిన దుస్థితి. ఇక్కడి అభ్యర్థులు ఒక్కొక్కరు రూ.200 జమ చేసుకొని కిటికీలకు దోమ తెరలు ఏర్పాటు చేసుకున్నారు.

మరుగుదొడ్లు లేవు: నరేశ్, కోదాడ

కోదాడ బాపూజీ గ్రంథాలయంలో మరుగుదొడ్లు లేవు. అభ్యర్థులకు పుస్తకాలు, స్టడీ ఛైర్లు, ఫ్యాన్లు దాతలు ఇచ్చినవే ఉన్నాయి. గ్రంథాలయ శాఖ నుంచి ఎలాంటి వస్తువులు ఇవ్వట్లేదు. మౌలిక వసతులు కూడా కల్పించడం లేదు.

2018 నుంచి జమవుతున్నాయి:సీతారామశాస్త్రి, జిల్లా కార్యదర్శి, సూర్యాపేటగతంలో నల్గొండ జిల్లా గ్రంథాలయ శాఖకు నిధులు జమయ్యాయి. జిల్లాల పునర్విభజనలో భాగంగా 2018 నుంచి సూర్యాపేట జిల్లా గ్రంథాలయానికి జమ అవుతున్నాయి. నిధులను ఇతర మండలాల్లోని గ్రంథాలయాల నిర్మాణానికి ఉపయోగిస్తాం. కోదాడ గ్రంథాలయంలో మౌలిక వసతులు కల్పించి, పుస్తకాలు, స్టడీ ఛైర్లు అందజేస్తాం.

# 'సొంతం' లేవాయె.. బాధలు తీరవాయె

నర్సాపూర్ : పట్టణంలోని చాలా ప్రభుత్వ కార్యాలయాలకు అతిథిగృహాలే దిక్కయ్యాయి. ప్రభుత్వ స్థలాలు లేవనే సాకుతో సొంత భవనాలు నిర్మించడం లేదు. నిధులున్నా పనులు చేయడం లేదు. అద్దె భవనాల్లో అవస్థల మధ్య కొనసాగిస్తున్నారు.

ఇదీ పరిస్థితి..నర్సాపూర్‌లో ఆబ్కారీ కార్యాలయానికి పక్కా భవనం లేదు. అద్దెకూ దొరక్కపోవడంతో నీటి పారుదలశాఖకు చెందిన అతిథిగృహంలో కొనసాగిస్తున్నారు. నిధులు, స్థలం కేటాయించినా.. పలు కారణాలతో నిర్మాణానికి నోచుకోవడం లేదు. అతిథి గృహంలో రెండు గదులు, ఒక హాలు మాత్రమే ఉన్నాయి. ఒక గదిలో సీఐ కార్యాలయం, మరో గదిలో ఎస్సైలు, సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. నర్సాపూర్, శివ్వంపేట, తూప్రాన్, మనోహరాబాద్, కొల్చారం, కౌడిపల్లి దీని పరిధిలోకే వస్తాయి. ఎక్సైజ్ కార్యకలాపాలన్నీ ఇక్కణ్నుంచే కొనసాగిస్తున్నారు. ఇక్కడ సీఐతోపాటు ముగ్గురు ఎస్సైలు, ఇద్దరు హెచ్‌సీలు, నలుగురు కానిస్టేబుళ్లు విధులు నిర్వహిస్తున్నారు. ఏదో ఒక పనిపై కార్యాలయానికి వచ్చేవారికి కూర్చునేందుకు స్థలం లేదు. రెండేళ్ల కిందట రూ.30 లక్షలు మంజూరైనా పనులకు మాత్రం శ్రీకారం చుట్టడం లేదు.

తహసీల్దారు కార్యాలయం..తహసీల్దార్ కార్యాలయం నీటిపారుదల శాఖకు చెందిన అతిథిగృహంలో నిర్వహిస్తున్నారు. పాత భవనం శిథిలావస్థకు చేరడంతో దాని స్థానంలో కొత్తది నిర్మించాలనుకున్నారు. పాత భవనాన్ని కూల్చివేశారు. పదేళ్ల కిందట రూ.70 లక్షలు మంజూరు కాగా.. గుత్తేదారు పనులు సైతం ప్రారంభించారు. పిల్లర్ల వరకూ పనులు చేపట్టి మధ్యలోనే వదిలేశారు. ఏళ్ల తరబడి పనులు అసంపూర్తిగా దర్శనమిస్తుండగా.. పురపాలిక ఇక్కడే సమీకృత మార్కెట్ నిర్మించేందుకు నిర్ణయించింది. తహసీల్దార్ కార్యాలయ పనులను తొలగించి దాని స్థానంలో రూ.4 కోట్లతో సమీకృత మార్కెట్ నిర్మిస్తున్నారు. దీంతో తహసీల్దార్ కార్యాలయానికి స్థలం



లేకుండాపోతోంది.

పశుసంవర్ధకశాఖ భవనంలో ఆర్డీవో కార్యాలయం..నర్సాపూర్‌లో రెవెన్యూ డివిజన్ కార్యాలయానికి సైతం పక్కా భవనం లేదు. ప్రస్తుతం ఈ కార్యాలయం పశుసంవర్ధకశాఖ భవనంలో నిర్వహిస్తున్నారు. అది ఏమాత్రం సరిపోవడం లేదు. అంతేకాకుండా డీఎల్పీవో, వ్యవసాయశాఖ, సహాయ కార్మిక శాఖ అధికారి, జూనియర్ సివిల్ కోర్టుకు పక్కా భవనాల్లేవు. కొన్ని అద్దె, మరికొన్ని ఇతర శాఖల భవనాల్లో కొనసాగుతున్నాయి. దీంతో పనులపై వస్తున్న వారు ఇబ్బందులు పడుతున్నారు.

అనువైన స్థలాలను వెదుకుతున్నాం..- కమలాద్రి, తహసీల్దార్

నర్సాపూర్‌లో ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాల నిర్మాణానికి అనువైన స్థలాలను వెదుకుతున్నాం. ఎన్నికలకు ముందు కొన్ని స్థలాలను పరిశీలించాం. సొంత భవనాలు లేక ఇబ్బందులు పడుతున్నది వాస్తవమే. తహసీల్దార్ కార్యాలయానికి స్థలాలను పరిశీలిస్తున్నాం.

# తల్లిపాల కేంద్రానికి నిధుల గ్రహణం

ఆదిలాబాద్ : ఆదిలాబాద్ రిమ్స్‌లో ఆరు నెలల లోపు చిన్నారులకు తల్లిపాలను అందించటానికి మంజూరైన తల్లి పాల(సీఎల్ ఎం–కాంప్రిహెన్సివ్ ల్యాక్టేషన్ మేనేజ్‌మెంట్) కేంద్రం ఏడాది కాలంగా నిర్మాణ దశలోనే కొట్టుమిట్టాడుతోంది. అప్పుడే జన్మించిన నవజాత శిశువుల నుంచి ఆరు నెలల వయసులోపు చిన్నారులకు వారి ఎదుగుదలకు, వ్యాధి నిరోధక శక్తి పెంపొందించడానికి 'తల్లి పాల'ను అందించటానికి రిమ్స్‌లో ఎన్‌హెచ్‌ఎంలో భాగంగా 'మిల్క్ బ్యాంకు' రూ.50 లక్షల అంచనా వ్యయంతో మంజూరైంది. రిమ్స్ ప్రసవ విభాగంలోని రెండు గదుల్లో దీన్ని ఏర్పాటు చేయటానికి రూ.25 లక్షలు కేటాయించగా రూ.19 లక్షలకు టెండర్లు పిలిచారు. గుత్తేదారు 18 శాతం తక్కువకు టెండర్లు వేసి పనులను దక్కించుకున్నారు. అనంతరం ఈ ఏడాది జనవరిలో పనులను ప్రారంభించిన గుత్తేదారు అర్థాంతరంగా పనులు నిలిపివేసి ఆ గదులకు తాళం వేసేశారు. ఖమ్మంలోని ఆసుపత్రిలో ఈ కేంద్రం 2022లోనే ప్రారంభం కాగా జిల్లా కేంద్రంలో మాత్రం నిధులు విడుదల కాకపోవటంతో పనులు ముందుకు సాగటం లేదు.

నవజాత శిశువులు, తక్కువ బరువు ఉన్నవారు, తల్లి పాలు సరిపోక ఇబ్బందులు పడుతున్న ఆరు నెలల వయసులోపు చిన్నారులు, అనాథ పిల్లలకు ఈ కేంద్రాల ద్వారా పాలను సేకరించి అందించటానికి ప్రస్తుతం ప్రభుత్వపరంగా రాష్ట్రంలో హైదరాబాద్‌లోని నీలోఫర్, ఖమ్మం, నల్గొండ జిల్లాల్లో అందుబాటులో ఉన్నాయి. తల్లి పాల వల్ల



శిశువులు ఆరోగ్యంగా, రోగ నిరోధక శక్తి కలిగి ఉంటారని ఈ కేంద్రాలను అందుబాటులోకి తెచ్చారు. రిమ్స్‌లో మంజూరు చేసిన కేంద్రం పనులు మాత్రం అర్థాంతరంగా ఆగిపోయాయి. ఫలితంగా ఆశించిన ప్రయోజనం నెరవేరటం లేదు.

పాల సేకరణ ఇలా..

కొందరు బాలింతలు శిశువుకు సరిపడా పాలు ఇచ్చాక కూడా క్షీరస్రావం అవుతుంది. అంటే వారిలో శిశువు అవసరానికి మించి పాలు ఉత్పత్తి అవుతాయి. అధిక పాలు ఉత్పత్తి కావటంతో ఛాతిలో గడ్డలు ఏర్పడి పలు రకాల ఇబ్బందులకు గురవుతుంటారు. ఇలాంటి వారికి అవగాహన కల్పించి మిల్క్‌బ్యాంకు సిబ్బంది వారి నుంచి పాలను సేకరిస్తారు. ఆ పాలను ప్రత్యేక పద్ధతుల్లో పలు దశల్లో శుద్ధి చేసి బాక్టీరియాను తొలగించి నిల్వ చేస్తారు. ఇలా నిల్వ చేసిన పాలను అవసరమైన పిల్లలకు అందిస్తారు.

ప్రత్యేక సిబ్బందిని నియమిస్తారు

'మిల్క్ బ్యాంకు' నిర్మాణం పూర్తయితే ఎన్‌హెచ్‌ఎం ద్వారా ప్రత్యేక సిబ్బంది నియామకం జరుగుతుంది. ఇందులో ఇద్దరు పిల్లల వైద్య నిపుణులు, అయిదుగురు నర్సులు, సీఎల్‌ఎంసీ టెక్నీషియన్, హైజీన్ హెల్పర్లు ముగ్గురు ప్రత్యేకంగా నియమితులవుతారు.

ఖమ్మంలోని సీఎల్‌ఎం కేంద్రం

ఇది ఖమ్మం జిల్లా కేంద్రంలోని తల్లి పాల(సీఎల్‌ఎం–కాంప్రిహెన్సివ్ ల్యాక్టేషన్ మేనేజ్‌మెంట్) కేంద్రం చిత్రం. 2022లోనే ప్రారంభమై వందలాది మంది తల్లుల నుంచి పాలను సేకరిస్తోంది. వాటిని తల్లిపాలకు నోచుకోని చిన్నారులకు అందిస్తున్నారు.

నిధులు విడుదల కాక ఆగిన పనులు

నరసింహారావు, ఈఈ టీఎస్‌ఎంఐడీసీతల్లి పాల కేంద్రం ఏర్పాటుకు గుత్తేదారుకు రూ.16 లక్షల అంచనా విలువ పనులను అప్పగించాం. రూ.5.86 లక్షల మేర పనులను పూర్తి చేశారు. చెల్లింపుల కోసం బిల్లులు పంపగా విడుదల కాలేదు. గుత్తేదారు పనులు నిలిపివేశారు. నిధులు విడుదల కాగానే పనులను ప్రారంభిస్తాం.

# వణికించే చలి.. చన్నీటి స్నానమే గతి



ఉట్నూరు : ఉమ్మడి జిల్లాలో చలికి జనమంతా గజగజ వణికిపోతున్నారు. ఏజెన్సీలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఇలాంటి పరిస్థితిలో ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు, కస్తూర్బా విద్యాలయాల్లో చదివే గిరిజన విద్యార్థుల ఇబ్బందులను తగ్గించాలన్న ప్రభుత్వ ఆశయం నీరుగారుతోంది. గుత్తేదారుల ఇష్టారాజ్యం, అధికారుల నిర్లక్ష్యంతో విద్యార్థులకు చన్నీటి స్నానమే దిక్కవుతోంది. తెలంగాణ కశ్మీర్‌గా పిలిచే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మారుమూల గ్రామాల్లోని గిరిజన ఆశ్రమ పాఠశాలలు, కస్తూర్బా విద్యాలయాలు, వసతి గృహాల విద్యార్థులు చలికాలంలో చన్నీటి స్నానం చేసి అనారోగ్యం బారినపడకుండా వారికి వేడి నీళ్ల సౌకర్యం కల్పించేందుకు ఐటీడీఏ అధికారులు విద్యా సంస్థల్లో సౌరశక్తితో పని చేసే వేడి నీటి పరికరాలు(సోలార్ వాటర్ హీటర్లు) బిగించారు.

రూ.3 కోట్లతో..ఐటీడీఏ పరిధిలోని ఆదిలాబాద్, కుమురం భీం, మంచిర్యాల, నిర్మల్ జిల్లాలలో ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు, కస్తూర్బా విద్యాలయాలు కలిపి మొత్తం 123 విద్యా సంస్థల్లో పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రూ.3 కోట్ల వ్యయంతో సౌరశక్తితో హీటర్లను అమర్చారు. కానీ బిగించిన నాటి నుంచి అవి మొరాయిస్తూనే ఉన్నాయి. విద్యార్థులు మొరపెట్టుకుంటే గుత్తేదారు వచ్చి మొక్కుబడిగా మరమ్మతులు చేసి చేతులు దులుపుకోవడం పరిపాటిగా మారింది. అయినా ఐటీడీఏ అధికారులు మాత్రం ఈ సమస్యను పట్టించుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గిరిజన విద్యార్థుల ఆరోగ్యంపై అధికారులకు చిత్తశుద్ధి కరవైందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జ్వరాల బారిన విద్యార్థులు..రూ.కోట్లు ఖర్చుచేసి గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో అమర్చిన సోలార్ వాటర్ హీటర్లతో చుక్క నీరు వేడి కావడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వణికించే చలితో ఇబ్బందిపడుతున్నా.. వేడి నీళ్ల సౌకర్యం మాత్రం కరవైందన్నారు. చన్నీటితో స్నానం చేసి తలనొప్పి, జ్వరాల బారినపడుతున్నామని వాపోయారు.

మరమ్మతులు చేయిస్తాం..దిలీప్‌కుమార్, డీడీ, ఐటీడీఏ

సమస్యను గుర్తించాం. మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. సాధ్యమైనంత త్వరగా వాటర్ హీటర్లను బాగు చేయించి విద్యార్థులకు వేడి నీరు అందేలా చర్యలు తీసుకుంటాం.

వేడినీళ్లు లేక ఇబ్బంది పడుతున్నాం

హనీ, బాలికల పాఠశాల విద్యార్థిని

వాతావరణం చాలా చల్లగా ఉంటోంది. ఉదయం 6 గంటలకే స్నానం చేయాల్సి ఉంటుంది. తీవ్రమైన చలిలో వేడినీళ్లు లేక చాలా ఇబ్బందులు పడుతున్నాం. మా సమస్యను చూసి వేడినీళ్లు వచ్చేలా చర్యలు తీసుకోవాలి.బాగు చేయించాలి రూపావతి, కస్తూర్బా విద్యాలయం

చలికాలం ప్రారంభమైన నాటి నుంచి చెబుతూనే ఉన్నాం. అయినా అధికారులు స్పందించడం లేదు. ఇంత చలిలో చల్లటి నీటితో స్నానం చేయడంతో రోజంతా తలనొప్పిగా ఉంటుంది. అధికారులు ఇప్పటికైనా సోలార్ హీటర్లను బాగు చేయించి వేడినీళ్లు వచ్చేలా చూడాలి.

# ప్రభుత్వ లేఅవుట్‌లో వసతులపై నిర్లక్ష్యం

ఆదిలాబాద్ : జిల్లా కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన లేఅవుట్‌లో మౌలిక వసతుల కల్పనను యంత్రాంగం నిర్లక్ష్యం చేస్తోంది. లబ్ధిదారులు ప్లాట్లు కొని ఏడాది పూర్తయినా ఇళ్లు నిర్మించుకునేందుకు వేచిచూడక తప్పని పరిస్థితి నెలకొంది. ఇళ్ల స్థలాలు కొనుగోలు చేసిన లబ్ధిదారులు డబ్బులు చెల్లించడంతో అధికారులు ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చారు. లేఅవుట్‌లో ఇప్పటిదాకా తాగునీరు, మురుగు కాలువల నిర్మాణం, విద్యుత్తు సదుపాయం, పార్కుల ఏర్పాటుకు సంబంధించిన పనులు ప్రారంభించలేదు. వేలంపాటకు ముందు హడావుడి చేసిన అధికారులు వేలం ముగిశాక వసతుల కల్పనపై తాత్సారం చేస్తుండటంతో ఇళ్లస్థలాలు కొన్న లబ్ధిదారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

ఇళ్ల స్థలాల వేలంతో రూ. 95 కోట్లు..

ప్రభుత్వం రాజీవ్ స్వగృహ కార్పొరేషన్‌కు చెందిన మావల మండలం బట్టిసావర్గాం శివారులో సర్వే నెంబరు 72/1/2, 72/1/3లోని 29 ఎకరాలను లేఅవుట్ చేసింది. పార్కులు, ప్రజావసరాల స్థలాలు పోను 150, 200, 240, 266, 150–1088 స్క్వేర్‌యార్డుల్లో 362 ప్లాట్లను విభజించారు. చదరపు గజానికి కనీస ధర రూ.8 వేలు నిర్ణయించి గతేడాది నవంబరు 14 నుంచి 19 వరకు బహిరంగ వేలం వేశారు. బిడ్డర్లు పోటీపడి ప్లాట్లను దక్కించుకున్నారు. మూడు వాయిదాల్లో బిడ్డర్లు డబ్బులు చెల్లించాల్సి ఉండగా 58 మంది డబ్బులు చెల్లించకపోవడంతో ఈ ఏడాది మార్చి 17న మరోసారి మిగిలిన ఇళ్ల స్థలాలకు



వేలం వేశారు. రెండు మినహా 56 ప్లాట్లు అమ్ముడుపోయాయి. రెండోసారి రూ.13.48 కోట్ల ఆదాయం వచ్చింది. మొత్తానికి 360 ప్లాట్లకు దాదాపు రూ.95 కోట్ల ఆదాయం సమకూరింది.అభివృద్ధి పనులపై తీవ్ర జాప్యం

లేఅవుట్ అభివృద్ధికి సంబంధించిన పనులను రాష్ట్ర పారిశ్రామిక మౌలిక వసతుల కల్పన సంస్థ(టీఎస్‌ఐఐసీ) ఆధ్వర్యంలో చేపట్టారు. వెంచర్‌లో అంతర్గత రహదారులు, తాగునీరు, మురుగు కాలువలు, విద్యుత్తు సదుపాయం, వెనుకభాగం వైపు ప్రహరీ నిర్మించాల్సి ఉంది. ఇప్పటికి బీటీ రోడ్డు పనులు మాత్రమే చేశారు. ఇతర పనుల జాడ లేదు. గుత్తేదారు పార్కుకు కేటాయించిన స్థలంలో మొరం తవ్వేసి రహదారుల నిర్మాణంలో వాడినట్లు ఆరోపణలున్నాయి. అక్కడ ప్రస్తుతం గుంత ఏర్పడటంతో పార్కు ఏర్పాటుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. లేఅవుట్‌కు బయటి వైపు అనుమతులకు విరుద్ధంగా లింకు రోడ్డు ఏర్పాటు చేసుకుని భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో లబ్ధిదారులు అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని వాపోతున్నారు. మౌలిక వసతుల పురోగతిపై టీఎస్‌ఐఐసీ కరీంనగర్ జోనల్ మేనేజరు స్వామిని చరవాణిలో వివరణ కోరేందుకు పలుమార్లు ప్రయత్నించగా స్పందించలేదు.లేఅవుట్‌కు పశ్చిమం వైపు ప్రహరీ నిర్మించాల్సి ఉండగా అటువైపు అనుమతి లేకుండా లేఅవుట్‌కు లింకు రోడ్డు ఏర్పాటు చేసుకుని వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి.లబ్ధిదారులు జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

# సింగరేణి ప్రచారానికి కాంగ్రెస్ దూరం!

ఉట్నూరు : సింగరేణిలో గుర్తింపు ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ దూరంగా ఉండాలని నిర్ణయించినట్లు సమాచారం. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఒకే ఒక్క సీటు కేటాయించినప్పటికీ సీపీఐ మార్పును కోరుకుంటూ కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చిన విషయం తెలిసిందే. సింగరేణిలో జరిగిన ఆరు ఎన్నికల్లో మూడుసార్లు గుర్తింపు సంఘంగా గెలిచిన సీపీఐ అనుబంధ ఏఐటీయూసీ నాలుగోసారి విజయం సాధించాలనే తపనతో ఉంది. కాంగ్రెస్ అనుబంధ ఐఎన్టీయూసీ 2003లో ఒక్కసారి గుర్తింపు సంఘంగా గెలుపొందింది. 2017లో పోటీ చేయకుండా ఏఐటీయూసీకి మద్దతు ప్రకటించింది. ఈసారి కాంగ్రెస్ మద్దతు ఇచ్చినా, ఇవ్వకున్నా పోటీ చేయాలని ఐఎన్టీయూసీ ఉక్కు సంకల్పంతో ఉంది. ఐఎన్టీయూసీ జాతీయ అధ్యక్షుడు జి.సంజీవరెడ్డి మద్దతు కోసం ఆ సంఘం సెక్రెటరీ జనరల్ బి.జనక్‌ప్రసాద్ ఇటీవల ఆయనను కలిసి సింగరేణి పరిస్థితిని వివరించి, ఎన్నికల ప్రచారానికి రావాలని కోరారు. దీనికి సంజీవరెడ్డి సమ్మతించి భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఆయన ఆశీస్సులతో ఐఎన్టీయూసీ ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేసింది. రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులను వివరిస్తూ ఏఐటీయూసీ నాయకులు ఐఎన్టీయూసీ నేతలను సంప్రదించగా, తాము పోటీలో ఉండటం ఖాయమని, కాంగ్రెస్ మద్దతు ఇచ్చినా, ఇవ్వకున్నా పట్టించుకునేది లేదని చెప్పినట్లు సమాచారం. దీంతో ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీలు ప్రత్యర్థులుగా సింగరేణిలో తలపడటం తప్పనిసరైంది. ఎమ్మెల్యేలు సైతం..శాసనసభ ఎన్నికల్లో సింగరేణి వ్యాప్తంగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలుగా పోటీ చేసిన అభ్యర్థులకు ఏఐటీయూసీ నాయకులు, కార్యకర్తలు సంపూర్ణంగా మద్దతునిచ్చారు. వారితో ప్రస్తుతం ఏఐటీయూసీ నాయకులకు సత్సంబంధాలు ఉండటంతో, సింగరేణి గుర్తింపు పోరులో కాంగ్రెస్ అనుబంధ ఐఎన్టీయూసీకి మద్దతు కోరుతూ గనులపై ప్రచారం చేయడం ఇబ్బందికరంగా ఉంటుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్ నాయకులు గుర్తింపు ఎన్నికలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారు. సింగరేణి విస్తరించిన ఆరు జిల్లాల్లో 11 స్థానాల్లో కాంగ్రెస్ ఆధిక్యత సాధించిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ మద్దతు ప్రకటిస్తే, సింగరేణిలో తెబొగకాసం పరిస్థితి తమకు ఎదురౌతుందని పార్టీ నేతలు భావిస్తున్నట్లు తెలిసింది. సింగరేణిలో భారాస పట్ల కార్మికవర్గంలో వ్యతిరేకత లేనప్పటికీ, తెబొగకాసం నాయకులు అనుసరించిన విధానాలు ఆ పార్టీకి నష్టం కలుగజేసిన విషయాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు కొందరు ప్రస్తావిస్తున్నారు. భవిష్యత్తులో తమకు అదే పరిస్థితి పునరావృతం అవడం కన్నా, గుర్తింపు ఎన్నికలకు దూరంగా ఉండటమే శ్రేయస్కరమని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా పెద్దపల్లి జిల్లాలో మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్, మంచిర్యాల జిల్లాలో ప్రేమ్‌సాగర్‌రావు, వివేక్‌లు గుర్తింపు పోరులో సమాన దూరం పాటించడమే మేలనే ఉద్దేశంతో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. శాసనసభ ఎన్నికల్లో ఐఎన్టీయూసీ శ్రేణులు కాంగ్రెస్‌కు గట్టి మద్దతునిచ్చాయని, ఇప్పుడు ఎన్నికల్లో ఎమ్మెల్యేలు తమకు సహకరిస్తారనే నమ్మకంతో ఆ వర్గాలు ఉన్నాయి. పార్టీ నిర్ణయం మేరకు తటస్థంగా ఉండే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. రెండు సంఘాలు కలిసి ప్రస్తుత గుర్తింపు సంఘం తెబొగకాసంను ఏ విధంగా ఎదుర్కొంటాయని కార్మికవర్గం ఆసక్తిగా గమనిస్తోంది. ఏ సంఘం నాయకులు అందుబాటులో ఉంటారు. ఎవరు కార్మికుల సమస్యలు పరిష్కరిస్తారు. ఎవరు అవినీతికి దూరంగా ఉంటారనే కోణంలో ఆలోచించి గుర్తింపు సంఘాన్ని ఎంపిక చేసుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. గతంతో పోలిస్తే ప్రస్తుతం కార్మికుల సంఖ్య గణనీయంగా తగ్గడంతోపాటు, ఇప్పుడున్న కార్మికుల్లో 90 శాతం మేరకు చదువుకున్నవారే ఉన్నారు. గతంలో నిరక్షరాస్యుల సంఖ్య అధికంగా ఉండేది. సీనియర్ కార్మికుల స్థానంలో కొత్తగా వచ్చిన యువ ఓటర్లు ఎటువైపు మొగ్గు చూపుతారనే అంశంపైనే గుర్తింపు సంఘం భవితవ్యం ఆధారపడి ఉంటుంది.

# యాసంగి ప్రణాళిక ఖరారు

పెద్దపల్లి : జిల్లాలో యాసంగి సాగు ప్రణాళిక ఖరారైంది. ప్రధాన నీటి వనరులైన ఎస్సారెస్పీ, గోదావరి, మానేరుతో పాటు చిన్ననీటి వనరుల కింద పంట సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవడంతో జలాశయాలు, చెరువులు, కుంటలు నీటితో కళకళలాడుతున్నాయి.జిల్లాలో 2,18,702 ఎకరాల్లో యాసంగి సాగు లక్ష్యం కాగా ఇందులో 2,05,321 ఎకరాల్లో వరి సాగవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. నీటి సమస్య లేకపోవడంతో అధికంగా రైతులు వరి సాగు వైపు ఆసక్తి చూపుతున్నారు. వానాకాలం పంట కోతలు తుది దశకు చేరడంతో దుక్కులు సిద్ధం చేసుకుంటున్నారు. విత్తనాలు, ఎరువులను సమకూర్చుకుంటున్నారు.

వరి వైపే రైతుల ఆసక్తి

ఆయకట్టు ప్రాంతమైన జిల్లాలో వరి సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఎస్సారెస్పీ డీ–83 పరిధిలో 1,03,339 ఎకరాలు, డీ–86లో 79,360 ఎకరాలు, చెరువుల కింద 51,323 ఎకరాలు, బోరుబావుల పరిధిలో 24,172 ఎకరాలు, బావుల కింద 43,049 ఎకరాల సాగుభూములున్నాయి. గతేడాది యాసంగిలో 2.17 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేయగా ఈసారి స్వల్పంగా పెరిగి 2.18 లక్షల ఎకరాల్లో సాగవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. అయితే వరి సాగు విస్తీర్ణం మాత్రం కొద్దిగా తగ్గింది. గతేడాది 2,05,474 ఎకరాలు సాగు చేయగా ప్రస్తుతం 2,05,321 ఎకరాల్లో సాగవుతుందని భావిస్తున్నారు. పెసర, మినుము, పొద్దుతిరుగుడు తదితర ఆరుతడి పంటల సాగు పెరిగింది.

ఎరువుల కొరత అధిగమించేలా..

యాసంగి అవసరాలకు ఎరువుల కొరత లేకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ సీజన్‌కు సంబంధించి యూరియా, డీఏపీ, కాంప్లెక్స్, పొటాషియమ్, సల్ఫేట్ కలిపి మొత్తం 69,950 మెట్రిక్ టన్నుల ఎరువుల అవసరం కాగా పస్తుతం 16,644 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయి. నెలవారీగా అవసరమైన ఎరువులు సరఫరా చేసేందుకు ప్రణాళిక రూపొందించారు. జిల్లాలో వరి, ఆరుతడి పంటలకు విత్తనాల కొరత లేకుండా చర్యలు చేపట్టారు. ఎరువులు, విత్తనాలు అధిక ధరలకు విక్రయించకుండా డీలర్లపై పర్యవేక్షణ పెంచారు. కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని ఆదేశాలు జారీ చేశారు.

ఆరుతడి సాగుపై అవగాహన

జిల్లాలో యాసంగి సాగు ప్రణాళిక సిద్ధం చేశాం. రైతులకు విత్తనాలు, ఎరువుల కొరత రాకుండా అన్ని జాగ్రత్తలూ తీసుకుంటున్నాం. ఆరుతడి పంటల సాగుపై రైతుల్లో అవగాహన కల్పిస్తున్నాం.ఆదిరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి

# రాయికల్‌లో ఇసుక అక్రమ రవాణా

రాయికల్: రాయికల్ మండలంలోని పెద్దవాగు తీర ప్రాంతాల నుంచి జోరుగా ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. రాయికల్ మండలంలోని ఇటిక్యాల, మూటపల్లి, కొత్తపేట గ్రామాల శివారులోని పెద్దవాగు తీరాల నుంచి నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాకు ఓ గ్రామంలో రూ.లక్షల్లో టెండరు వేసినట్లు సమాచారం. నిత్యం ఉదయం నుంచి రాత్రి వరకు ట్రాక్టర్లలో ఎలాంటి అనుమతులు లేకుండా గ్రామాలకు ఇసుక రవాణా చేయడం పలువురికి ఉపాధిగా మారింది. ఒక్కో ట్రాక్టరు ఇసుక రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. నిత్యం రాత్రి పగలు తేడా లేకుండా ఇసుక రవాణా చేయడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. సామాన్యులు నిర్మాణాల కోసం తహసీల్దారు అనుమతి పత్రాలతో ఇసుక రవాణా చేసుకునే అవకాశం ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఉంటుంది. కానీ కొందరు ఎలాంటి అనుమతి లేకుండా రాత్రి పూట ఇసుక అక్రమ రవాణా సాగిస్తున్నారు. ఫలితంగా గ్రామాల్లో భూగర్భజలాలు అడుగంటి పోయే అవకాశం ఉంది. అధికారులు స్పందించి అక్రమ ఇసుక రవాణాపై చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.



# అతివకు ప్రయాణ కానుక

కరీంనగర్ : కొత్త సర్కారు సరికొత్త హామీని నెరవేర్చనుంది. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తామనే మాటను ఆచరణలో చూపించబోతోంది. అతివలంతా ఇక ఎలాంటి ప్రయాణ ఛార్జీలు లేకుండా ఉచితంగానే వారి గమ్యస్థానాలకు వెళ్లే సదుపాయాన్ని కొత్త ప్రభుత్వం కల్పిస్తోంది. మధ్యాహ్నం నుంచి ఈ విధానం అమలులోకి రానుంది. ఈ మేరకు రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఉన్నతాధికారుల ఆదేశాలతో కరీంనగర్ రీజియన్ సిబ్బంది తగిన ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలో ప్రస్తుతం నడుస్తున్న ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగు బస్సులను యథావిధిగా అన్ని మార్గాల్లో నడిపేందుకు అవసరమైన చర్యల్ని తీసుకుంటున్నారు.

సిబ్బందికి సూచనలు..

ఉచిత ప్రయాణం విషయంలో ఎక్కడా ఇబ్బంది తలెత్తకుండా ఉండేందుకు ఆర్టీసీ ఉన్నతాధికారులు దృశ్య సమీక్షలో రీజియన్ పరిధి ఉద్యోగులకు పలు సూచనల్ని అందించారు. డ్రైవర్లు, కండక్టర్లు మహిళలతో మర్యాదగా ప్రవర్తించడంతోపాటు వారు కోరిన చోట బస్సును ఆపాలని స్పష్టం చేశారు. ఇదే సమయంలో బస్సులో ఎక్కే బాలికలు, యువతులు, మహిళల సంఖ్యను విధిగా ప్రతి బస్సు వారీగా నమోదు చేసుకోవాలని ఆదేశాలిచ్చారు. దీంతో రోజులో ఎంతమంది ఉచిత ప్రయాణ సదుపాయాన్ని వినియోగించుకుంటారనేది అధికారులకు తెలియనుంది. ఇప్పటి వరకు ప్రయాణిస్తున్న మహిళలకన్నా ఇక మీదట ప్రయాణించే వారి సంఖ్య మరో 10 శాతం పెరిగే వీలుందని అధికారులు భావిస్తున్నారు. ఆటోల్లో ప్రయాణించేవారిలో కొంతమంది బస్సులను ఆశ్రయించే వీలుందని పేర్కొంటున్నారు. ప్రస్తుతానికి వారం రోజులపాటు అందరు మహిళలకు ప్రయాణానికి అనుమతి ఇవ్వాలని నిర్ణయించారు. వారం రోజుల తరువాత మాత్రం విధిగా వారు తెలంగాణ ప్రాంతానికి చెందిన మహిళలనే ధ్రువీకరణను తెలిపే గుర్తింపు కార్డుని చూపించాలని నిబంధన విధించనున్నట్లు అధికారులు చెప్పారు.

అన్ని మార్గాల్లో అవకాశం..కరీంనగర్ రీజియన్ పరిధిలోని అన్ని రకాల బస్సులు ప్రతి రోజు సగటున 3.50 లక్షల కిలోమీటర్ల మేర నడుస్తున్నాయి. ఇందులో ఎక్కువగా ఎక్స్‌ప్రెస్‌లు, పల్లె వెలుగు వాహనాలే ఎక్కువగా తిరుగుతున్నాయి. ప్రధానంగా హైదరాబాద్, నిజామాబాద్, వరంగల్, గోదావరిఖని, కామారెడ్డి మార్గాల్లో ఎక్స్‌ప్రెస్‌లు నడుస్తున్నాయి. ఇక అన్ని మండల కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాలకు పల్లె వెలుగు బస్సులు వెళ్తున్నాయి. రోజులో సగటున అన్ని బస్సుల్లో కలిపి 2.60 లక్షల మంది ప్రయాణికులు వారి గమ్యస్థానాలకు వెళ్తున్నారు. ఇందులో దాదాపుగా 55 శాతం మహిళా ప్రయాణికులే ఉంటున్నారు. రోజుకు ఆర్టీసీకి కరీంనగర్ రీజియన్ పరిధిలో రూ.1.50 కోట్ల ఆదాయం సమకూరుతుంది. ఈ ఉచిత ప్రయాణాల వల్ల ఆర్టీసీ ఖజానాకు ప్రతిరోజు సుమారుగా రూ.70 లక్షల నుంచి రూ.80 లక్షల వరకు రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేయాల్సి ఉంటుంది. నేటి నుంచి కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల పరిధిలోని అన్ని మార్గాల్లో ఎక్స్‌ప్రెస్‌లు, పల్లెవెలుగు బస్సుల్లో ఉచితంగా ప్రయాణానికి అవకాశం కల్పిస్తున్నారు. సూపర్ లగ్జరీ, రాజధానిల్లో మాత్రం ఉచితానికి అవకాశం లేదు.

# జలమే బలం.. పొదుపే మంత్రం

కొత్తగూడెం :ఇంట్లో నల్లా తిప్పి నీళ్లు పట్టుకోవడం పెద్ద కష్టం కాకపోవచ్చు. కానీ ఆ నీళ్లు ఎక్కడ్నుంచి సరఫరా అవుతున్నాయి? ఎంతదూరం నుంచి పట్టణాలకు చేరుతున్నాయి? ప్రతి లీటరు సేకరించి శుద్ధి చేయడానికి ఎంత ప్రజాధనం ఖర్చవుతుంది? నిత్యం ఏమేరకు జలాలు వృథా అవుతున్నాయి? అని ఆలోచిస్తే నీటి విలువెంతో అవగతం అవుతుంది. ఇదంతా ప్రజలకు విడమర్చి చెబితే కచ్చితంగా ఫలితం ఉంటుందని పురపాలక శాఖ భావిస్తోంది. వృథా అడ్డుకట్టకు ఈ సీజన్‌లో 'అవగాహన మంత్రం' ప్రయోగిస్తోంది. పట్టణాల్లో తాగునీటి వృథా ఎక్కువగా ఉంది. దీన్ని అరికట్టడానికి రాష్ట్ర పురపాలక శాఖ (సీడీఎంఏ) ఈ ఏడాది వేసవిలో కొత్త ప్రయోగం చేస్తోంది. ఎక్కువ నీటి వృథా జరుగుతున్న ఇళ్లను గుర్తించి, వారికి కౌన్సెలింగ్ ఇవ్వడం ద్వారా సత్ఫలితాలు రాబట్టాలని చూస్తోంది. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల పరిధిలోని ఏడు పురపాలక సంఘాలు, ఒక నగరపాలక సంస్థ ఉంది. వాటి పరిధిలో 232 వార్డులున్నాయి. ఆయా వార్డుల్లో ఉన్న భవనాల సంఖ్య 1,95,690. ఒక్కో పురపాలకంలో తొలుత ఐదు వార్డులను.. ప్రతి వార్డుల్లో 500 చొప్పున నివాసాలు ఎంపిక చేయనున్నారు. ఆయా కుటుంబాలకు కౌన్సెలింగ్ ఇవ్వనున్నారు. ప్రధానంగా మురికివాడలు, శివారు ప్రాంతాల్లో దృష్టి సారించనున్నట్లు ఆ విభాగం అధికారులు చెబుతున్నారు. రెండు మూడ్రోజుల్లో ప్రక్రియను ప్రారంభించనున్నారు.

ఇదీ.. పరిస్థితి..పట్టణాల్లో సరఫరా సమయంలోనే నల్లా నీళ్లు భారీగా



వృథా అవుతున్నాయి. శివారులో అయితే సాధారణ రోజుల్లో గంట నుంచి గంటన్నర వరకు నీటి సరఫరా జరుగుతుంది. చాలా కాలనీల్లో ఇళ్లకు ప్రత్యేకంగా సంపులు లేవు. వచ్చే నీటిని బిందెలు, డ్రమ్ముల్లో అప్పటికప్పుడు పట్టుకోవాలి. ఆ తర్వాత నల్లాలను బంద్ చేయాలి. అయితే చాలామంది ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కొందరు పైపులు బిగించి ఇంటి ఆవరణ, ఇంటి ముందున్న రోడ్లను శుభ్రం చేసుకుంటున్నారు. ఇంకొందరు మొక్కలకు పడుతున్నారు. పలువురు ద్విచక్రవాహనాలు, కార్లు శుభ్రం చేస్తున్నారు. ఫలితంగా ఎగువ ప్రాంతాల్లో సరిగా నీళ్లు అందని పరిస్థితి దాపురిస్తోంది. వృథాను అరికడితే ఎద్దడిని ఎదుర్కొంటున్న కాలనీలకు మళ్లించడానికి అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో ప్రతి నీటి బొట్టు సద్వినియోగమయ్యేలా చూడాలని అధికారులు భావిస్తున్నారు.

ఏదైనా ఇంటి నుంచి నీరు వృథాగా పోతున్నట్లు గుర్తిస్తే వెంటనే అప్రమత్తం చేస్తారు. జాగ్రత్తలు తెలియజేస్తారు. నీటి విలువపై కౌన్సెలింగ్ ఇస్తారు.

ఇలా పలుమార్లు అవగాహన కల్పించడం ద్వారా మార్పు వస్తుందని అధికారులు భావిస్తున్నారు.

ఆ తర్వాత మిగతా వార్డుల్లోనూ మరికొన్ని కాలనీలను ఎంపిక చేసి ఇదే తరహా చర్యలు చేపట్టనున్నారు.

తీసుకోనున్న చర్యలివే...

ప్రస్తుతం రెండు జిల్లాలోని ప్రధాన పట్టణాల పరిధిలో రోజుకు దాదాపు 341 ఎంఎల్‌డీల తాగునీరు డిమాండ్ ఉంది. కేవలం 260 ఎంఎల్‌డీలు మాత్రమే సరఫరా చేయగలుగుతున్నారు.

నీటి సరఫరాకు 35 మెగావాట్ల విద్యుత్తు వినియోగిస్తున్నారు. ప్రతినెలా విద్యుత్తు బిల్లుల కింద చెల్లిస్తున్న మొత్తం రూ.1.15 కోట్లు.

ఈ లెక్కన ప్రతి 1,000 లీటర్ల సరఫరాకు చేస్తున్న వ్యయం సుమారు రూ.50.

సరఫరా చేస్తున్న నీటిలో సుమారు 40 శాతానికి కనీస లెక్కలు ఉండటం లేదు. 20 శాతం లీకేజీలు, మిగతా మొత్తం అక్రమ నల్లాలు, మోటార్లు బిగించడం, అనవసర వృథాగా లెక్కిస్తున్నారు.

ఈ నేపథ్యంలో నీటి వృథాను గుర్తించి పొదుపుగా వాడుకోవాల్సిన అవసరంపై అవగాహన కల్పించనున్నారు.

తొలుత ఎంపిక చేసిన వార్డుల్లో స్థానిక స్వయం సహాయక సంఘాల సభ్యులు, పంపు ఆపరేటర్లు, సిబ్బందితో కలిసి అధికారులు పర్యటిస్తారు. నీటి సరఫరా జరిగే సమయంలో సుమారు 500 ఇళ్లల్లో పరిస్థితిని పరిశీలిస్తారు. ఆయా నివాసాల్లో నీళ్లు ఏఏ మార్గాల్లో వృథా అవుతున్నాయి? ఎవరైనా వాహనాలు శుభ్రం చేస్తున్నారా? మురుగు కాల్వలోకి వదిలేస్తున్నారా? అనేది చూస్తారు.

# భద్రాద్రి సొబగులు

మణుగూరు : రాష్ట్రానికి విద్యుత్తు వెలుగులు అందిస్తున్న ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు మణుగూరు సమీపంలోని భద్రాద్రి థర్మల్ విద్యుత్తు కేంద్రం. రణగొణ ధ్వనులు, దుమ్ము, దూళితో ఉండే ప్లాంట్ పరిసరాలు క్రమేణా మారుతున్నాయి. ప్లాంట్ ఆవరణ పచ్చదనంతో ఆహ్లాదంగా మారుతోంది. మొత్తంగా కొత్త రూపు సంతరించుకుంటోంది. 30 శాతం పచ్చదనం: నిబంధనల మేరకు ప్లాంట్ నిర్మాణం కోసం సేకరించిన భూమిలో 30 శాతం గ్రీనరీ ఏర్పాటు చేయాలి. నిర్మాణ భెల్ సంస్థ బీటీపీఎస్‌కి చెందిన 350 ఎకరాల్లో గ్రీనరీని ఏర్పాటు చేస్తుంది. ఇప్పటికే కూలింగ్ టవర్, యాష్‌పాండ్, ఇతర ఖాళీ ప్రదేశాల్లో వందలకొద్దీ మొక్కలు నాటారు. ప్రధాన గేట్‌కి సమీపంలో ఏర్పాటుచేసిన ఫౌంటెన్ అకర్షణీయంగా ఉంది. పచ్చదనంతోపాటు అంతర్గత రహదారులు, వీధి దీపాలు, ఎల్‌ఈడీ రోప్ లైట్లు ఏర్పాటు చేశారు. రహదారుల వెంట డ్రైన్లు నిర్మిస్తున్నారు. రాత్రి వేళల్లో వీధి దీపాలు వెలుగులు జిలుగులతో ఆకట్టుకొంటున్నాయి. దీంతో సందర్శకుల తాకిడి పెరుగుతుంది. సాయంత్రం వేళల్లో పరిసర గ్రామాల ప్రజలు ఫౌంటెన్, కూలింగ్ టవర్ పరిసరాల్లో సరదగా గడిపి ఫొటోలు దిగుతున్నారు. సందర్శకుల కోసం కూలింగ్ టవర్ వద్ద విజిటింగ్ ప్రదేశాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈ పనులు జరుగుతున్నాయి. స్టార్ హోటల్‌ని తలపించేలా : ఉద్యోగులకు ప్రత్యేకంగా హాస్టల్ భవనాన్ని జెన్కో నిర్మించింది. విద్యుదుత్పత్తి, రైలు మార్గం నిర్మాణం ఇతర అవసరాల నిమిత్తం ఇతర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే ఉద్యోగులకు వసతి, భోజనం అందించాల్సిన బాధ్యత జెన్కోదే. ఈ క్రమంలో సాంబయ్యగూడెం వద్ద రూ.5 కోట్లతో హాస్టల్ భవనాన్ని నిర్మించారు. భవనం ఫైవ్‌స్టార్ హోటల్‌ని తలపించేలా ఉంది. లిఫ్టు సౌకర్యంతో ఆధునిక వసతులు ఏర్పాటు చేస్తున్నారు. పనులు తుది దశకు చేరుకొన్నాయి. "బీటీపీఎస్ ఆవరణ ఏడాదిలోపు పూర్తిగా మారుతుంది.

# పసుపు రంగు మిరప భలే



ఖమ్మం : తెలుగు రాష్ట్రాల్లో పండించే వాణిజ్య పంటల్లో మిరపకు మంచి డిమాండ్ ఉంది. ప్రపంచం మొత్తం మీద మిరపలో 400 రకాలు ఉన్నట్లు గుర్తించారు. వీటిలో తెలంగాణలో అత్యధిక రకాలను సాగు చేస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రస్తుతం ఎరుపు రంగు రకాలైన తేజా, లావులు, చపాటాలను సాగు చేస్తున్నారు. ఇటీవల కొంతమంది రైతులు పసుపు రంగు మిరపపై ఆసక్తి చూపుతున్నారు. ఖమ్మం జిల్లాలోని తిరుమలాయపాలెం, ఏన్కూరు మండలాల్లో ఈ రకం సాగు చేశారు. క్వింటాకు రూ.35 వేల నుంచి రూ.40 వేల వరకు ధర ఉంటుందని రైతులు భావిస్తున్నారు.

మార్కెట్లో డిమాండ్ ఉందని...

మార్కెట్‌లో ఈ రకానికి డిమాండ్ ఉండటం, చీడ పీడలు, ఎరుపు రంగు రకాలతో పోలిస్తే కొద్దిగా తక్కువ ఉండటం సాగుకు కారణం. ముఖ్యంగా పసుపు మిరపను పంజాబ్, దక్షిణ కశ్మీర్‌లో రైతులు ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఈ రకాన్ని పచ్చళ్ల తయారీ, సాస్‌లు, సూప్‌లు, కూరల్లో, ఔషధాల తయారీలో వాడుతున్నారు. యాంటీ బ్యాక్టీరియల్, నొప్పులు తగ్గించే ఔషధ గుణాలున్నాయని పరిశోధనల్లో తేలింది. ఊబకాయుల్లో కొలెస్ట్రాల్ తగ్గించటంలో ప్రముఖ పాత్ర పోషిస్తోంది. ఈ రకంలో విటమిన్–సి, విటమిన్–ఎ సమపాళ్లలో ఉన్నాయి. మిరప కాయలకు క్యాప్సాథిన్ అనే కెరోటినాయిడ్ వల్ల ఎరుపు రంగు వస్తుంది. పసుపు రంగు రావటానికి బీటా కెరొటీన్, బీటా క్రిప్టో జాంతిన్ అనే కెరొటినాయిడ్‌లు కారణమని మధిర ఉద్యానశాఖ అధికారి వేణు తెలిపారు.

సాధారణ మిరప సాగులానే...

పసుపు మిర్చి కూడా ఇంచుమించు ఎరుపు రంగు మిరప సాగులానే ఉంటుంది. దీన్ని ఎక్కువగా ఎండు మిరపగా ఉపయోగిస్తారు. దీనిలో లావులు, సన్నాలు రకాలున్నాయి. కొన్ని ప్రైవేటు కంపెనీలకు చెందిన విత్తనాలు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. నాటిన రెండు నెలలకు పూత రావటం మొదలవుతుంది. తరువాత నెలకు దిగుబడి వస్తుంది. కాయలు ఆకుపచ్చ నుంచి పసుపు రంగుకు మారిన వెంటనే కోస్తే ఎండిన తర్వాత తొడిమ ముడత పడక, కాయలకు మంచి నిగారింపు వస్తుంది. కాయ నాణ్యత, దిగుబడులు పెరగాలంటే వీలైనన్ని సార్లు కోతలు కోయాలి. దిగుబడి ఎకరానికి 15 నుంచి 20 క్వింటాళ్ల వరకు వస్తుంది.

జిల్లాలో ప్రయోగాత్మక సాగు...

తిరుమలాయపాలెం మండలం తిప్పారెడ్డిగూడేనికి చెందిన రైతు ఉపేందర్ ఈ ఏడాది ముప్పాతిక ఎకరంలో పసుపు రంగు మిరప సాగు చేశారు. మొత్తం 8 వేల మొక్కలు వేసి 15 క్వింటాళ్ల దిగుబడి సాధించారు. ఏన్కూరు మండలం జన్నారానికి చెందిన కొండపల్లి నరేశ్ ఒక ఎకరంలో పసుపు రంగు మిరపను సాగు చేశారు. పెట్టుబడి ఎకరానికి రూ.లక్ష వరకు కాగా ఇప్పటి వరకు 10 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఇంత వరకు సరకును విక్రయించలేదు. శీతల గిడ్డంగిలో నిల్వ ఉంచారు. గుంటూరు/వరంగల్ విపణిలో విక్రయించాలనే ఆలోచనలో ఉన్నారు. యూట్యూబ్‌లో చూసి విత్తనాలను కొనుగోలు చేసి ప్రయోగాత్మకంగా సాగు చేశారు.

ఆసక్తి చూపుతున్న రైతులు

అనసూయ, జిల్లా ఉద్యాన, ..పట్టుపరిశ్రమ అధికారి, ఖమ్మం..కొత్త రకం పసుపు రంగు మిరపపై కొంతమంది రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఇద్దరు ప్రయోగాత్మకంగా సాగు చేశారు. ఇది విజయవంతమైతే మరి కొంతమంది సాగు చేసే అవకాశం ఉంది. ఈ పంట సాగుకు ఇక్కడి నేలలు అనుకూలంగా ఉన్నాయి. దిగుబడి, మార్కెటింగ్ తదితర సౌకర్యాలను దృష్టిలో పెట్టుకుని కొత్త రకం పంటలను సాగు చేయడం మంచిది.

# బంధాలను వీడి.. కన్నీళ్లను మిగిల్చి

ఖమ్మం : రాళ్లు తరలిస్తున్న ట్రాక్టర్ ట్రక్కు పల్టీ కొట్టిన ఘటనలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడిన సంఘటన కామేపల్లి మండలం పండితాపురంలో చోటుచేసుకుంది. సూర్యాపేట జిల్లా అనంతగిరి మండల కేంద్రానికి చెందిన ఐదుగురు వ్యక్తులు ఫెన్సింగ్ రాళ్ల లోడుతో కోదాడ నుంచి కారేపల్లికి వస్తున్నారు. వీరిలో నలుగురు వ్యక్తులు ట్రక్కులో రాళ్లపై కూర్చున్నారు. పండితాపురం వద్ద ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించే సమయంలో ట్రక్కు పల్టీ కొట్టింది. రాళ్లు నలుగురిపై పడటంతో తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు రాళ్లను తీసి క్షతగాత్రులను బయటకు తీసుకురాగా అప్పటికే చిన్నం ప్రవీణ్(35) మృతి చెందారు. మరో ముగ్గురు సూరేపల్లి కిరణ్, మంద సందీప్, నకరికంటి సతీష్ తీవ్ర గాయాలయ్యాయి. డ్రైవర్ పరారయ్యాడు. ఘటన స్థలానికి చేరుకున్న శిక్షణ ఐపీఎస్ అవినాష్, ఎస్సై కిరణ్ కుమార్ క్షతగాత్రులను అంబులెన్సులో ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. మృతుడు చిన్నం ప్రవీణ్‌కు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ప్రవీణ్ బాబాయి కాంతయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిరణ్ కుమార్ తెలిపారు.

లారీ ఢీకొని యువకుడు..

పెనుబల్లి మండలం లంకాసాగర్ క్రాస్‌రోడ్డు వద్ద ద్విచక్రవాహనాన్ని, లారీ ఢీకొట్టిన ప్రమాదంలో కల్లూరు మండలం లోకారానికి చెందిన అన్నపురెడ్డి నాగరాజు(25) దుర్మరణం పాలయ్యాడు. వివరాలు ఇలా ఉన్నాయి... నాగరాజు చెల్లెలు సత్తుపల్లిలో ఉండటంతో ఆమెను చూసేందుకు ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. మార్గమధ్యలోని లంకాసాగర్ క్రాస్‌రోడ్డు వద్ద కాకినాడ నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న లారీ ఎదురుగా ఢీకొట్టడంతో నాగరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. లారీ టైర్లలో ద్విచక్రవాహనం ఇరుక్కోవడంతో దాదాపు 300 మీటర్లు లాక్కెళ్లింది. నాగరాజు కల్లూరు మండలం పుల్లయ్యబంజర్‌లోని ఓ రైస్‌మిల్లులో హమాలీగా పని చేస్తూ తన కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇంటి పెద్దదిక్కు మృతి చెందాడని కుటుంబసభ్యులు గుండెలవిసేలా రోదించారు. సంఘటన స్థలాన్ని వీఎం బంజర్ ఎస్సై సూరజ్ సందర్శించి శవపరీక్ష నిమిత్తం మృతదేహాన్ని పెనుబల్లి వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య

పెనుబల్లి మండలం గంగదేవిపాడుకు చెందిన కేళోతు నాగేశ్వరరావు(33) ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. కేళోతు నాగేశ్వరరావు ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అప్పులు ఎక్కువవడంతో మనస్తాపం చెందాడు. దీంతో ఇంట్లో నుంచి ఈ నెల 12న ఎవ్వరికీ చెప్పకుండా బయటకు వెళ్లాడు. సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెదికినా కన్పించలేదు. ఊరి శివారులోని ఓ మామిడితోటలో నాగేశ్వరరావు శవమై కనిపించాడు. వెంటనే కుటుంబసభ్యులు వీఎం బంజర్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలాన్ని ఎస్సై సూరజ్ సందర్శించారు. ఆర్థిక ఇబ్బందుల వల్లే ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ప్రేమించిన బాలిక దక్కదని..

ఇద్దరూ మైనర్లే. వారికుటుంబాల మధ్య బంధుత్వం ఉంది. ఇరువురు ప్రేమించుకున్నారు. పెళ్లి చేసుకుందామని ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయారు. ఆశ్రయం కోసం నాలుగు రోజులు పలు ప్రదేశాలు తిరిగి బంధువుల ఇంటికి చేరుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఇరువైపుల పెద్దలు మేజర్లు అయిన తర్వాత ఇద్దరికి వెళ్లి చేద్దామని నిర్ణయించారు. అయినా ఆ బాలుడు పెద్దలను నమ్మలేదు. ప్రేమించిన



బాలిక తనకు దక్కదనే భయంతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన అశ్వారావుపేట మండలంలో గురువారం జరిగింది. ఎస్సై రాజేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. అశ్వారావుపేట మండలంలోని ఓ గ్రామానికి చెందిన పదిహేడేళ్ల బాలుడు, అదే మండలానికి చెందిన పద్నాలుగేళ్ల బాలికను ప్రేమించాడు. ఈ నెల 9న ఇద్దరు కలసి ఇంట్లో నుంచి వెళ్లిపోయారు. హైదరాబాద్, సూర్యాపేటలలో ఆశ్రయం కోసం తిరిగారు. తిరిగి బుధవారం ఉదయం మండలంలోని మరో గ్రామంలో ఉన్న బాలుడి బంధువుల ఇంటికి చేరుకున్నారు. విషయం రెండు కుటుంబాల వారికి తెలిసి వచ్చారు. ఇద్దరు ఒకే సామాజిక వర్గం కావటంతో మేజర్లు అయిన తర్వాత పెళ్లి చేద్దామని పెద్దలు నిర్ణయించి బాలికను తీసుకువెళ్లారు. దీంతో మనస్తాపం చెందిన బాలుడు తాను ప్రేమించిన బాలికతో పెళ్లి కాదేమోనని మనస్తాపంతో బంధువుల ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. దీనిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తండ్రి కళ్లెదుటే నీట మునిగి..

చెరువులో తండ్రి చేపల వేట సాగిస్తుండగా అదే చెరువులో మరోవైపు కుమారుడు ఈత కొడుతున్నాడు. లోతులోకి వెళ్లిన కుమారుడు కళ్లెదుటే నీటమునిగి మృతి చెందడంతో తండ్రి కన్నీరుమున్నీరయ్యాడు. ఈ విషాద ఘటన మండలంలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఉసుర్లగూడేనికి చెందిన కొర్సా రాముడు కొత్తమామిళ్లవారిగూడెం సమీప ఊరచెరువులో గ్రామస్థులతో కలసి చేపల వేటకు వెళ్లాడు. రాముడు వేట సాగిస్తుండగా అతడి కుమారుడు కొర్సా ఏసుబాబు అలియాస్ చందు(19) నలుగురు స్నేహితులతో కలసి అదే చెరువులో ఈతకు దిగాడు. ఏసుబాబు ఈత కొడుతూ ప్రమాదవశాత్తు లోతులోకి వెళ్లి నీటిలో మునిగిపోతూ కేకలువేశాడు. అవతల గట్టువైపు ఉన్న తండ్రి దీన్ని గమనించి కుమారుడిని కాపాడేందుకు వెళ్లేసరికే ఏసుబాబు నీటిలో మునిగిపోయాడు. అక్కడ ఉన్నవారు గాలించి ఏసుబాబును బయటకు తీయగా అప్పటికే మృతి చెందాడు. ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబానికి ఆసరాగా ఉన్న కుమారుడు కళ్లెదుటే మృత్యువాత పడటంతో ఆ తండ్రి, తల్లి దుర్గమ్మ హృదయ విదారకంగా విలపించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబీకులకు అప్పగించినట్లు ఎస్సై రాజేశ్‌కుమార్ తెలిపారు.

ఎన్నెస్పీ కాలువలో పడి..కల్లూరు మండలం మర్లపాడు వద్ద ప్రమాదవశాత్తు ఎన్నెస్పీ కాలువలో పడి జనగామ జిల్లాకు చెందిన వ్యక్తి మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం బసివిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన కుక్కసావు ఆంజనేయులు(45) కుటుంబంతో సహా వరికోత యంత్రం వెంబడి కూలి పనుల కోసం పదిరోజుల క్రితం వచ్చి కల్లూరు మండలం మర్లపాడులో ఉంటున్నాడు. ప్రమాదవశాత్తు ఎన్నెస్పీ కాలువలో పడి మృతి చెందాడు. ఆంజనేయులుకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతుని సోదరుడు నరసింహారావు ఫిర్యాదుమేరకు ఎస్సై రఘు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుబల్లి వైద్యశాలకు తరలించారు.

# తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి

వరంగల్ : నగరంలో రానున్న రోజుల్లో ఎండల తీవ్రత ఉంటుందని నిపుణుల హెచ్చరికలతో తాగునీటి సరఫరా గ్రేటర్ వరంగల్, పబ్లిక్ హెల్త్ ఇంజినీర్లు ప్రత్యేక దృష్టి సారించారు. ధర్మసాగర్ చెరువులో నిల్వ ఉన్న తాగునీళ్లు రంగు మారకుండా ఉండేందుకు నిరంతరం పరిశీలన చేయాలని గ్రేటర్ వరంగల్ నీటి సరఫరా సలహాదారు, మెట్రో వాటర్ బోర్డు విశ్రాంత సీఈ రవికుమార్ సూచించారు. దీనిలో భాగంగా రెండు శాఖల ఇంజినీర్లు ధర్మసాగర్ చెరువును సందర్శించారు. దేవాదుల ప్రాజెక్టు నుంచి గోదావరి నదీ జలాల పంపింగ్ కొనసాగుతున్నందున బురద నీరు నగరానికి సరఫరా కాకుండా చూడాలని నిర్ణయించారు. ఎండలు ముదిరితే చెరువులో నిల్వ ఉన్న తాగునీళ్లు రంగు మారే అవకాశం ఉంటుందని, ముందస్తుగా రోజూ బ్లీచింగ్ పొడి చల్లాలని సూచించారు. ఉష్ణోగ్రత పెరిగితే తాగునీరు



పచ్చగా మారకుండా ఆలం, బొగ్గు, ఇతర రసాయనాలు మోతాదు ప్రకారం కలపాలని, ధర్మసాగర్ చెరువు నుంచి వడ్డేపల్లి, కేయూసీ, దేశాయిపేట ఫిల్టర్‌బెడ్‌కు పంపింగ్ చేస్తున్న శుద్ధిచేయని నీటిని నిరంతరం పరీక్షించాలని డీఈ, ఏఈలను ఆదేశించారు.

తాగునీటి శుద్ధీకరణ పరిశీలన

విశ్రాంత సీఈ రెండు రోజులుగా హనుమకొండ వడ్డేపల్లి, కేయూసీ, వరంగల్ దేశాయిపేట తాగునీటి శుద్ధీకరణ కేంద్రాలను పరిశీలించారు. ధర్మసాగర్ నుంచి శుద్ధిచేయని నీళ్ల పరిస్థితి, తాగునీటి శుద్ధీకరణ ఎలా జరుగుతుందని ఇంజినీర్లను అడిగి తెలుసుకున్నారు. మూడు ఫిల్టర్‌బెడ్లలో రెండు, మూడు నెలలకు సరిపడా రసాయనాలు సిద్ధంగా ఉంచాలని, క్లోరిన్ సిలిండర్లు, బ్లీచింగ్ పొడి కొనుగోలు చేయాలన్నారు. ఎండలు పెరిగాయని, నగరంలోని 66 డివిజన్లలో ప్రతి చివరి ఇంటి వరకు స్వచ్ఛమైన తాగునీళ్లు అందేలా చూడాలని డీఈ, ఏఈలకు సూచించారు.

# రహదారి విస్తరణకు అడ్డంకులు

వరంగల్ : ముందు చూపు లేకుండా చేసిన పనులు అభివృద్ధికి ఆటంకం కలిగిస్తున్నాయి. ప్రస్తుతం కాళేశ్వరం నుంచి భూపాలపల్లి మీదుగా గణపురం, రేగొండ, పరకాల, శాయంపేట మండలాలను కలుపుతూ నిర్మిస్తున్న జాతీయ రహదారికి అనేక అడ్డంకులు ఎదురవుతున్నాయి. భూపాలపల్లి నుంచి చెల్పూరు దాకా హైటెన్షన్ విద్యుత్తు స్తంభాలు రోడ్డు విస్తరణలో భాగంగా నిర్మిస్తున్న డ్రైనేజీల మధ్యలోకి వస్తున్నాయి. కేటీపీపీకి కాళేశ్వరం నుంచి గోదావరి నీటిని సరఫరా చేయడానికి రోడ్డుకు ఇరువైపులా జెన్‌కో రెండు పైపులైన్లను 53 కిలోమీటర్ల మేర ఏర్పాటు చేసింది. ఆ పైపులైను



డ్రైనేజీ మధ్యలోనే ఉంది. అప్పట్లోనే రూ.200 కోట్లతో ఏర్పాటు చేసిన ఈ పైపులైన్‌ను తీసే పరిస్థితి లేదు. దీంతో ఎయిర్‌వాల్వులు ఉన్న చోట వదిలేసి కాల్వలను నిర్మిస్తున్నారు. మిషన్ భగీరథ, విద్యుత్తు స్తంభాలు, నియంత్రికలు అనేకం ఉన్నాయి. వాటిని కూడా వదిలేసి డ్రైనేజీలు నిర్మిస్తుండడంతో భవిష్యత్తులో భారీ వర్షాలు కురిస్తే వర్షం నీరు రోడ్డుపై ప్రవహించి రాకపోకలు నిలిచిపోతాయని పలువురు అంటున్నారు. దీనిపై జాతీయ రహదారుల అధికారులు నోరు మెదపడం లేదు. తమపని తాము చేసుకుంటూ వెళ్తున్నామని, ఇవన్నీ తొలగించాలంటే బోలెడన్ని అనుమతులు కావాలని.. అవివచ్చే దాకా ఉంటే నిధులు వెనక్కి వెళ్తాయని చెబుతున్నారు. జిల్లా కేంద్రానికి దగ్గర్లో చెల్పూరుతో పాటు భూపాలపల్లిలోనూ ఇదే పరిస్థితి ఉంది. పనులు పకడ్బందీగా చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# తూకం యంత్రం.. అలంకారప్రాయం

వరంగల్ : గోవిందరావుపేట మార్కెట్ సబ్‌యార్డులో మూడేళ్ల క్రితం సుమారు రూ.8 లక్షల వ్యయంతో నిర్మించిన వేబ్రిడ్జి(తూకం యంత్రం) నిరుపయోగంగా మిగిలింది. మార్కెట్ సబ్ యార్డులో నిర్మించిన పెద్ద గోదామును పౌరసరఫరాల శాఖ అద్దెకు తీసుకుంది. ఇందుకు గాను నెలకు రూ. 60 వేల అద్దె కూడా చెల్లిస్తున్నారు. పౌరసరఫరాల శాఖ ఇక్కడ పెద్ద మొత్తంలో బియ్యాన్ని నిల్వ చేస్తోంది. నిల్వలను మళ్లీ చౌక ధరల దుకాణానికి తరలించేటప్పుడు మరోసారి తూకం వేసి పంపించాల్సి ఉంటుంది. మార్కెట్ సబ్ యార్డులో ఉన్న వేబ్రిడ్జి నిరుపయోగంగా ఉండడంతో ప్రైవేటు నిర్వాహకులను ఆశ్రయిస్తున్నారు. పౌరసరఫరాల శాఖ మార్కెటింగ్ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినప్పటికీ ఫలితం కనిపించలేదని తెలిసింది. మార్కెట్ సబ్‌యార్డులో పెద్ద మొత్తంలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ కూడా జరుగుతోంది. ఈ నేపథ్యంలో తూకం యంత్రం వినియోగంలోకి వస్తే రైతులతో పాటు సహకార సంఘం, ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు కూడా ఉపయోగించుకునే అవకాశం ఉంటుంది. ఇప్పటికైనా మార్కెటింగ్‌శాఖ అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది.



# ప్రైవేటు సంస్థల అవార్డులు.. ఉద్యోగులకు కొత్త రూల్స్

దిల్లీ: ప్రైవేటు సంస్థల నుంచి అవార్డులు అందుకునే విషయంలో ప్రభుత్వ ఉద్యోగులకు కేంద్రం కొత్త మార్గదర్శకాలు జారీ చేసింది. వాటిని అంగీకరించే ముందు సంబంధిత అధికారుల నుంచి తప్పనిసరిగా ముందస్తు అనుమతి తీసుకోవాలని స్పష్టం చేసింది. ఈ మేరకు అన్ని కేంద్ర ప్రభుత్వ విభాగాలకు కేంద్ర సిబ్బంది వ్యవహారాల మంత్రిత్వ శాఖ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. "ప్రైవేటు సంస్థలు ఇచ్చే అవార్డులు స్వీకరించే ముందు.. ప్రభుత్వ ఉద్యోగులు సంబంధిత అధికారుల ముందస్తు అనుమతి తీసుకోవాలి.

సదరు ఉద్యోగి పనిచేస్తున్న మంత్రిత్వ శాఖ లేదా విభాగం సెక్రటరీ నుంచి ఈ అనుమతులు పొందాలి. ఇక ప్రభుత్వ కార్యదర్శులు, సెక్రటరీ ర్యాంక్ అధికారులు ఈ అవార్డులు స్వీకరించాలంటే.. కేబినెట్ సెక్రటరీ నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలి" అని ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. అయితే, అసాధారణ పరిస్థితుల్లో మాత్రమే ప్రభుత్వ ఉద్యోగులు.. ప్రైవేటు సంస్థల నుంచి అవార్డులు స్వీకరించేందుకు అధికారులు అనుమతులివ్వాలని సిబ్బంది వ్యవహారాల మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

అంతేగాక, ఈ అవార్డులు నగదు లేదా ఇతర సదుపాయాల రూపంలో ఉండకూడదని స్పష్టం చేసింది. 1964 నాటి కేంద్ర సివిల్ సర్వీసెస్ నిబంధనల ప్రకారం.. ఏ ప్రభుత్వ ఉద్యోగి ప్రైవేటు వ్యక్తుల నుంచి అవార్డులు తీసుకోకూడదు. ఆ ఉద్యోగి గౌరవార్థం జరిగే ప్రైవేటు కార్యక్రమాలకు హాజరుకాకూడదు. అయితే, ఈ నిబంధనలను ఆ తర్వాత పలుమార్లు మార్చారు. చివరిసారిగా 2000 సంవత్సరంలో దీనిపై ఉత్తర్వులు జారీ చేస్తూ.. "ప్రైవేటు సంస్థలు, ట్రస్ట్‌లు ఇచ్చే ద్రవ్య ప్రయోజనాల అవార్డులను తీసుకునేందుకు ప్రభుత్వ ఉద్యోగులకు అనుమతి లేదు" అని స్పష్టం చేశారు.

అయితే, ఈ నిబంధనలను ఉద్యోగులు సరిగా పాటించక పోవడంతో.. తాజాగా కేంద్రం కొత్త మార్గదర్శకాలను జారీ చేసింది. వీటిని ఉద్యోగులంతా తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేసింది.



# మద్యం, ఇసుకలోనే కాదు.. విద్యాశాఖలోనూ భారీ అవినీతి!

మంగళగిరి: మద్యం, ఇసుకలో మాత్రమే అవినీతి జరిగిందని రాష్ట్ర ప్రజలు అనుకున్నారు. కానీ, పేద విద్యార్థుల కోసం ఖర్చు పెట్టాల్సిన నిధులను కూడా వైకాపా ప్రభుత్వం దుర్వినియోగం చేసిందని జనసేన పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ ఆరోపించారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ బ్యాంకు, కేంద్రం నుంచి విద్యాభివృద్ధికి వచ్చిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం దుర్వినియోగం చేసిందని వివరించారు. జగన్న విద్యా కిట్లలో రూ.120 కోట్ల అవినీతి జరిగిందని, ఆ నిధులను ఉత్తరాంధ్ర, తాడేపల్లి, రాయలసీమ ప్రాంతానికి తరలించారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నిర్ధారించిందని తెలిపారు. "అమ్మ ఒడిలో కూడా మోసం జరిగింది. స్కూల్ మెయింటెనెన్స్ కోసం ఒక్కో విద్యార్థి రూ.వెయ్యి చొప్పున ఇచ్చారు. ఆ నిధులు రూ.180 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలకు చెల్లించలేదు. సమగ్ర శిక్ష అభియాన్ కింద రాష్ట్రానికి ప్రపంచ బ్యాంకు రూ.700 కోట్ల ఎయిడ్ ఇచ్చింది. కేంద్రం, ఇతర సంస్థల నుంచి రాష్ట్రానికి రూ.6వేల కోట్లు వచ్చాయి. ఏడాదిలోనే కార్యక్రమాలు పూర్తి చేస్తామని సీఎం ప్రకటించారు. 27 నెలలు పూర్తయినా కార్యక్రమంలో పురోగతి లేదు. నాడు-నేడు రెండో విడతలో 13,860 అదనపు పాఠశాల గదులు నిర్మిస్తామన్నారు. కానీ, ఇప్పటి వరకు 612 అదనపు పాఠశాల గదులు మాత్రమే పూర్తయ్యాయి. పాఠశాలల్లో 6,001 ప్రహరీల నిర్మాణానికి టెండర్లు పిలిచారు. ఇప్పటి వరకు 600 ప్రహరీలు మాత్రమే పూర్తయ్యాయి. రాష్ట్రంలో 23,221 పాఠశాలలకు గాను.. 1,174 స్కూళ్లలోనే సౌకర్యాలు కల్పించారు. విద్యాశాఖలో కనీసం 10శాతం పనులు పూర్తి చేయలేదు. స్వచ్ఛ విద్యాలయ కార్యక్రమం కింద కేంద్రం నిధులు ఇచ్చింది. పాఠశాలల్లో 49,293 మరుగుదొడ్లు పూర్తి చేసినట్టు నివేదిక ఇచ్చారు. కేంద్రం, ఇతర సంస్థల నుంచి వచ్చిన రూ.6వేల కోట్లలో రూ.3,747 కోట్లు ఖర్చు పెట్టారు. ఎప్పుడూ వ్యక్తిగత విమర్శలు చేసి తప్పించుకునే సీఎం జగన్.. ఈ అంశాలపై స్పందించాలి. అవినీతికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి" అని నాదెండ్ల మనోహర్ డిమాండ్ చేశారు.

# ఇది కాంగ్రెస్ 'మనీ హైస్ట్'.. రూ.351 కోట్ల నోట్ల గుట్టలపై మోదీ విసుర్లు



దిల్లీ: ఝార్ఖండ్‌కు చెందిన కాంగ్రెస్ ఎంపీ ధీరజ్ సాహుకు సంబంధించిన కార్యాలయాలపై ఆదాయ పన్నుశాఖ అధికారులు జరిపిన దాడుల్లో రూ.351 కోట్ల విలువైన నగదు లభ్యం కావడం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. అలాగే సుమారు మూడు కేజీల బంగారు ఆభరణాలను కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నారని మీడియా కథనాలు పేర్కొన్నాయి. దీంతో తమకు సంబంధం లేదని కాంగ్రెస్ చెప్తున్నప్పటికీ.. ఆ పార్టీపై విమర్శలు ఆగడం లేదు. తాజాగా ప్రధాని మోదీ ట్విటర్(ఎక్స్) వేదికగా హస్తం పార్టీపై ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ఉండగా.. మనీహైస్ట్(పాపులర్ సిరీస్) అవసరం ఎవరికి ఉందన్నారు. '70 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ లూటీ కొనసాగుతుంటే.. భారత్‌లో మనీహైస్ట్‌లాంటి కల్పిత స్టోరీలు ఎవరికి కావాలి..?' అని మోదీ ట్వీట్ చేశారు. అలాగే 'కాంగ్రెస్ సమర్పిస్తోన్న మనీహైస్ట్' పేరిట భాజపా షేర్ చేసిన వీడియోను జత చేశారు. ఇదివరకు కూడా సాహు వ్యవహారంపై ప్రధాని స్పందించారు. ప్రజల నుంచి దోచుకున్న సొమ్మును ప్రతి రూపాయినీ వెనక్కి రప్పిస్తామని, ఇది మోదీ హామీ అని ట్వీట్ చేశారు. కాగా, మనీహైస్ట్ సిరీస్‌కు విపరీతమైన క్రేజ్ ఉంది. బ్యాంక్ దోపిడీల నేపథ్యంలో థ్రిల్లింగ్‌గా సాగే వెబ్‌సిరీస్ అది. సాహు కంపెనీలో భారీ నగదు లభ్యమైన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఆయన నుంచి వివరణ కోరింది. అది ఆయన ప్రైవేటు వ్యవహారమని, పార్టీతో సంబంధం లేదని స్పష్టం చేసింది. అయితే ఆయన కాంగ్రెస్ ఎంపీ అయినందున అంత మొత్తం ఎలా వచ్చిందో అధికారిక ప్రకటన చేయాల్సి ఉందని ఆదేశించింది.




# యోగిని శాంభవి సంచలన వ్యాఖ్యలు

నంద్యాల: కొన్నేళ్ల క్రితం ఆధ్యాత్మిక ప్రవచనాలతో ఫేమస్ అయిన చిన్నారి యోగిని శాంభవి మరోసారి వార్తల్లోకి వచ్చారు. పెరిగి పెద్దైన ఆమె మళ్లీ సంచలన వ్యాఖ్యలు చేశారు. త్వరలో బ్రహ్మంగారు మళ్లీ వీరభోగ వసంతరాయలుగా జన్మిస్తారని అన్నారు. బ్రహ్మంగారు చెప్పినవన్నీ జరిగాయని, జరుగుతున్నాయని తెలిపారు. బ్రహ్మంగారి కాలజ్ఞానిని ఇంగ్లీషులో ట్రాన్స్‌లేట్ చేస్తున్నట్లు శాంభవి ప్రకటించారు. ఇటీవల నంద్యాల వచ్చిన శాంభవి బస్టాండ్ సమీపంలోని మధువర్ణ రామలింగం మందిరంలో పూజలు చేశారు. ఇప్పటి వరకు హిమాచల్ ప్రదేశ్‌లో ఉంటూ.. సంస్కృతం వేదాలు నేర్చుకున్నానన్నారు. శాంభవి మళ్లీ నంద్యాలకు రావడం.. అక్కడ బ్రహ్మంగారి గురించి వ్యాఖ్యలు చేయడం చర్చనీయాంశమైంది. 13 ఏళ్ల తర్వాత యోగిని శాంభవి మళ్లీ మహనంది మండలంలో ప్రత్యక్షమయ్యారు. కార్తీక మాసం సందర్భంగా సూర్యనంది, అలాగే నంద్యాల బస్టాండ్ పక్కన ఉన్న శివాలయంలో శాంభవితోపాటు స్థానికులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. 2009, 2010 సూర్యనందిలో శాంభవి ఐదేళ్ల వయసులో భవష్యవాణి చెబుతూ అందరినీ అకట్టుకున్నారు. తెలుగు రాష్ట్రాలతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి జనాలు తరలి వచ్చి శాంభవీకి ప్రత్యేక పూజలు కూడా చేశారు. ఆ తర్వాత కొన్ని కారణాల వల్ల నంద్యాల నుంచి హిమాలయాలకు వెళ్లిపోయారు. అక్కడ ఆశ్రమంలో ఆధ్యాత్మిక ప్రవచనాలు చదువుతూ.. 13 ఏళ్ల తర్వాత మళ్లీ నంద్యాలకు వచ్చారు.

## జనసేన చీఫ్ పవన్ కల్యాణ్‌ను కలిసిన కేశినేని చిన్ని

హైదరాబాద్/ అమరావతి: జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను టీడీపీ నేత కేశినేని శివనాథ్ (చిన్ని) మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని జనసేనాని నివాసంలో పవన్‌తో చిన్ని భేటీ అయ్యారు. ఈ సందర్భంగా టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అరెస్ట్ సమయంలో టీడీపీ, పార్టీ శ్రేణులకు పవన్ మద్దతు ఇవ్వడంపై చిన్ని ప్రత్యేకంగా అభినందించారు. పార్లమెంటు పరిధిలో చిన్ని చేస్తున్న సేవలు అన్నా క్యాంటీన్లు, మెడికల్ క్యాంపులు, ఇతర సేవా కార్యక్రమాలను పవన్ కళ్యాణ్ అభినందించారు. వన సమారాధనల పేరిట ఇతర కార్యక్రమాలతో జనసేన, టీడీపీ కలిసి ప్రయాణం చేస్తున్న వైనాన్ని చిన్ని వివరించారు. ఉద్దానం కిడ్నీ బాధితులకు బాసటగా నిలిచిన పవన్ కళ్యాణ్ స్ఫూర్తిగా చంద్రబాబు ఆదేశాల మేరకు పార్లమెంటు పరిధిలోని ఏ కొండూరు మండలంలో కిడ్నీ బాధితులకు చేసిన సేవలను చిన్ని వివరించారు.

ఏ కొండూరు మండలంలోని తండాలను పర్యటించి బాధితులకు ధైర్యాన్ని ఇవ్వాలని ఈ సందర్భంగా పవన్‌ను కేశినేని చిన్ని కోరారు.

## ఏపీలో అత్యధిక నిరుద్యోగిత రేటు దురదృష్టకరం

అమరావతి: దేశంలోని అన్ని రాష్ట్రాలతో పోల్చితే ఆంధ్రప్రదేశ్‌లో అత్యధికంగా నిరుద్యోగిత రేటు నమోదైందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగిత రేటు 24 శాతానికి పెరగటం దురదృష్టకరమన్నారు. ఉద్యోగ – ఉపాధి అవకాశాలతో వర్ధిల్లిన రాష్ట్రాన్ని వైఎస్ జగన్ నాశనం చేశారని విమర్శించారు. ఫలితంగా యువత నిరాశ, నిస్పృహలతో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. అన్ని అర్హతలు ఉన్న ఏపీ యువత భవిత మెరుగుపడాలని లోకేష్ ట్వీట్ చేశారు.





# తెలంగాణ కంటే అదనంగా ఇస్తామని ఇప్పుడు మాట మార్చారు

అమరావతి: ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా అంగన్‌వాడీలు ఆందోళనకు దిగారు. ప్రభుత్వంతో రెండు రోజులుగా జరిపిన చర్చలు విఫలం కావడంతో మంగళవారం నుంచి నిరవధికంగా సమ్మె చేస్తున్నారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాలు మూతపడ్డాయి. అంగన్‌వాడీలకు మద్దతుగా సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూలు కలిసి ఉమ్మడిగా సమ్మెలో పాల్గొంటున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా సీడీపీవో కార్యాలయాలు, మండల కేంద్రాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు నిరాహారదీక్షలు, ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. "కనీస వేతనం ?26వేలు ఇవ్వాలి. గ్రాట్యుటీతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించాలి. పనిభారం పెంచారు.. జీతాలు మాత్రం పెంచట్లేదు. నాసిరకం ఫోన్లు ఇచ్చి యాప్‌లలో విధులకు సంబంధించిన వివరాలు అప్‌డేట్ చేయమంటే ఎలా చేయాలి? జగనన్న ఇచ్చిన యాప్ మాత్రమే ఆ ఫోన్లలో ఉంటుంది. తెలంగాణ కంటే అదనంగా జీతం ఇస్తామన్నారు.. ఇప్పుడేమో మాట మార్చారు" అని రాష్ట్ర ప్రభుత్వంపై అంగన్‌వాడీలు మండిపడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 55,607 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. దాదాపుగా లక్ష మంది వరకు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ఉన్నారు. వీరంతా సమ్మె బాట పట్టారు.

## 14న సీఎం జగన్ శ్రీకాకుళం జిల్లాలో పర్యటన

అమరావతి: ఈ నెల 14న సీఎం జగన్ శ్రీకాకుళం జిల్లాలో పర్యటించనున్నారు. గన్నమురం ఎయిర్‌పోర్టు నుంచి విశాఖకు వాయుమార్గంలో చేరుకుని అక్కడి నుంచి హెలికాప్టర్‌లో శ్రీకాకుళం జిల్లా మకరంపురం గ్రామానికి సీఎం చేరుకుంటారు.

ఉద్దానం కిడ్నీ సమస్య నివారణకు చేపట్టిన వైఎస్సార్ సుజలధార ప్రాజెక్ట్‌ను సీఎం ప్రారయిభిస్తారు. పలాస చేరుకుని వైఎస్సార్ కిడ్నీ రీసెర్చ్ హాస్పిటల్‌ను ప్రారంభించి, శిలాఫలకాలను ఆవిష్కరిస్తారు. అక్కడి నుంచి పలాస రైల్వే గ్రౌండ్స్‌లో బహిరంగ సభకు హాజరువుతారు. తిరుగు ప్రయాణమై తాడేపల్లి చేరుకుంటారు.



## చంద్రబాబు కనుసైగ చేస్తే చాలు.. 40 మందికి పైగా వైసీపీ ఎమ్మెల్యేలు

అమరావతి: ఓటమి భయంతోనే రాష్ట్ర రాజకీయ చరిత్రలో ఏ పార్టీ చేయని విధంగా సీఎం జగన్ రెడ్డి రాజకీయ బదిలీలకు తెరతీశారని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు బొండా ఉమామహేశ్వరరావు వ్యాఖ్యలు చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. టీడీపీ – జనసేన కాంబినేషన్‌తో జగన్ రెడ్డి ఎన్నికలకు మూడు నెలల ముందే చేతులెత్తేశారన్నారు. ఒక నియోజకవర్గంలో చెల్లని కాసులు మరో నియోజకవర్గంలో ఎలా చెల్లుతాయి జగన్ రెడ్డి అని ప్రశ్నించారు. చిలకలూరి పేటలో జనానికి నచ్చనివారు గుంటూరు పశ్చిమంలో ఎలా గెలుస్తారని అడిగారు. పెడన ప్రజలు ఛీ కొట్టిన వ్యక్తి, మరో నియోజకవర్గంలో ఎలా ప్రజాభిమానం పొందుతారని నిలదీశారు. వైసీపీలో ఇప్పుడు 11 వికెట్లే పడ్డాయని.. 2024 జనవరికి ఆ పార్టీ దివాళా బోర్డు పెట్టడం ఖాయమన్నారు.



# గుంటూరు మున్సిపల్ కమిషనర్ కీర్తికి జైలు శిక్ష!




గుంటూరు: కోర్టు ఆదేశాలు పాటించని గుంటూరు మున్సిపల్ కమిషనర్ కీర్తికి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జైలు శిక్ష విధించింది. గుంటూరు కార్పొరేషన్ పరిధిలోని యడవలి వారి సత్రాన్ని అక్రమంగా ఆక్రమించుకొని ఎటువంటి లీజ్ చెల్లించకుండా స్కూల్‌ను నడుపుతున్నారంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై గతంలో విచారణ చేపట్టిన హైకోర్టు.. పిటిషనర్‌లకు రూ.25 లక్షలు చెల్లించాలని ఆదేశించింది. అయితే ఆ ఆదేశాలను మున్సిపల్ కమిషనర్ అమలు చేయడంలేదంటూ పిటిషనర్ మరోసారి హైకోర్టును ఆశ్రయించారు. పిటిషన్ దాఖలు చేసిన కోర్టు ధిక్కరణ వ్యాజ్యంపై విచారణ చేపట్టిన హైకోర్టు.. మున్సిపల్ కమిషనర్ కీర్తికి నెల రోజుల జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధించింది. జనవరి 2న హైకోర్టు రిజిస్ట్రార్ వద్ద లొంగిపోవాలని ఆమెను ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది.

## పోలీసులు కొట్టారని ఆత్మహత్యకు యత్నించిన దళిత యువకుడు మృతి

యర్రగొండపాలెం: ప్రకాశం జిల్లా యర్రగొండపాలెంలో పోలీసులు కొట్టారనే మనస్తాపంతో ఆత్మహత్యకు యత్నించిన దళిత యువకుడు మోజెస్ మృతి చెందాడు. ఈనెల 6న (బుధవారం) పోలీస్ స్టేషన్ ఆవరణలో ఒంటిపై పెట్రోల్ పోసుకుని అతడు నిప్పంటించుకున్నాడు. తీవ్రంగా గాయపడిన మోజెస్‌కు మార్కాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం గుంటూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ మోజెస్ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు.



## తండేల్: ఆ స్లాంగ్ కోసం సాయి పల్లవి కష్టాలు !

గీతా ఆర్ట్స్ బ్యానర్ లో నాగ చైతన్య హీరోగా చందూ మొండేటి దర్శకత్వంలో తెరకెక్కబోతున్న మూవీ తండేల్. తాజాగా ఈ సినిమా ఓపెనింగ్ జరిగింది. సాయి పల్లవి ఈ చిత్రంలో నాగ చైతన్యకి జోడీగా కనిపించబోతోంది. పాన్ ఇండియా లెవల్ లో భారీ బడ్జెట్ తో ఈ మూవీని గీతా ఆర్ట్స్ లో అల్లు అరవింద్ నిర్మిస్తున్నారు. జనవరి నుంచి రెగ్యులర్ షూటింగ్ స్టార్ట్ కానుంది. ప్రస్తుతం ఈ మూవీ ప్రీప్రొడక్షన్ వర్క్ స్టార్ట్ అవుతోంది. ఇదిలా ఉంటే సినిమాలో సాయి పల్లవి పాత్ర గురించి దర్శకుడు చందూ మొండేటి క్లారిటీ ఇచ్చారు. ఆమె శ్రీకాకుళంకి చెందిన ఒక పల్లెటూరి అమ్మాయి పాత్రలో సినిమాలో కనిపించబోతోంది. ఆమె పాత్రలో చాలా షేడ్స్ ఉంటాయి. అలాగే పక్కా శ్రీకాకుళం స్లాంగ్ లోనే ఆమె పాత్ర సంభాషణలు కూడా ఉంటాయని క్లారిటీ ఇచ్చాడు. ఇక పాత్ర పెర్ఫెక్షన్ కోసం సాయి పల్లవి ప్రత్యేకంగా శ్రీకాకుళం స్లాంగ్ నేర్చుకుంటుంది. దీనికోసం



వర్క్ షాప్ కూడా కండెక్ట్ చేసినట్లు తెలిపారు. పూర్తిస్థాయిలో ఆమె పాత్ర మీద పట్టు సాధించడానికి ప్రయత్నం చేస్తుందని, కచ్చితంగా తండేల్ చిత్రంలో కొత్త సాయిపల్లవిని చూస్తారని చందూ చెప్పుకొచ్చారు. హీరో నాగ చైతన్యని ప్రేమించే అమ్మాయిగా సాయి పల్లవి కనిపిస్తుందని అన్నారు. అలాగే తన హక్కుల కోసం పోరాడే డేరింగ్ విమెన్ పాత్రలో పవర్ ఫుల్ పెర్ఫార్మెన్స్ ని కూడా ఇవ్వనుందని చందూ తెలిపారు. ఇక మూవీలో సాయి పల్లవి పాత్ర అందరిని ఆశ్చర్యపరుస్తుందని చెప్పారు. విరాటపర్వం, లవ్ స్టోరీ చిత్రాల తర్వాత సాయి పల్లవి చాలా గ్యాప్ తీసుకొని తండేల్ మూవీకి ఒకే చెప్పింది. ఈ మధ్యలో చాలా ఆఫర్స్ తిరస్కరించింది. దీనిని బట్టి ఈ చిత్రంలో ఆమె పాత్ర ఎంత గొప్పగా ఉండబోతోందో అర్ధం చేసుకోవచ్చు. ఫిదా సినిమా కోసం తెలంగాణ స్లాంగ్ నేర్చుకొని పెర్ఫెక్ట్ గా భానుమతి క్యారెక్టర్ ని న్యాయం చేసిన సాయి పల్లవి తండేల్ లో సిక్కోలు యువతిగా జీవించేయడం ఖాయం అనే మాట వినిపిస్తోంది.

## అనుష్క కాదు.. చిరు కోసం ఆ బ్యూటీ

టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి వరుస సినిమాలతో దూసుకెళ్తున్నారు. ఇటీవలే భోళాశంకర్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన చిరు.. ఇప్పుడు మరో సినిమా మొదలుపెట్టేశారు. మెగా156గా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి విశ్వంభర అనే పేరు ఫిక్స్ చేయనున్నారు. ఈ మూవీని బింబిసార ఫేమ్ డైరెక్టర్ వశిష్ఠ దర్శకత్వం వహిస్తుండగా.. యూవీ క్రియేషన్స్ పతాకంపై విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. అయితే ఈ మూవీ షూటింగ్ ప్రారంభమే పోరాట ఘట్టాలతోనే మొదలైంది. మారేడుమిల్లి అడవుల్లో కీలక సన్నివేశాలన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ జరుగుతుండగానే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటేసేందుకు చిరంజీవి విరామం తీసుకుని హైదరాబాద్ వచ్చారు. ఈ మూవీలో చిరంజీవి సరసన పలువురు



హీరోయిన్లు నటించే ఛాన్స్ ఉంది. వాస్తవానికి ఈ సినిమాలో సీనియర్ హీరోయిన్ అనుష్క శెట్టి ఒక్కరే హీరోయిన్ అని గతంలోనే బయటకు వచ్చింది. కానీ ఇప్పుడు తెరపైకి త్రిష పేరు వచ్చింది. అనుష్క శెట్టి ఆశించిన స్థాయిలో బరువు తగ్గకపోవడంతో ఆ ఛాన్స్ త్రిషకు దక్కినట్లు తెలుస్తోంది. త్రిషను పేరును చిరునే సజ్జెస్ట్ చేశారట. పొన్నియన్ సెల్వన్, లియో వంటి చిత్రాలతో పాన్ ఇండియా రేంజ్‌లో గుర్తింపు సంపాదించుకున్న త్రిష.. చాలా రోజులుగా టాలీవుడ్ రీఎంట్రీకి ఎదురు చూస్తోంది. మెగాస్టార్ చిత్రంతో వస్తున్న ఈ అవకాశాన్ని ఆమె ఉపయోగించుకోవాలని ఫిక్స్ అయిందట. అప్పట్లో చిరంజీవి, త్రిష కాంబినేషన్‌లో వచ్చిన స్టాలిన్ చిత్రం సూపర్ హిట్ అయింది. ఆ తర్వాత ఆచార్య సినిమాలో మరోసారి వీరిద్దరూ కలిసి నటించనున్నారనే వార్తలు వచ్చాయి. కానీ కొన్ని కారణాల వల్ల త్రిష స్థానంలో కాజల్ అగర్వాల్‌ను తీసుకున్నారు మేకర్స్. ఏదేమైనా చిరు సినిమాలోకి త్రిష ఎంట్రీకి సంబంధించి అఫీషియల్ అప్డేట్ వచ్చే వరకు వేచి చూడాల్సిందే. అయితే మెగా 156లో విజువల్ ఎఫెక్ట్స్‌కు ప్రాధాన్యం ఎక్కువగా ఉంది. ఈ సినిమా ప్రత్యేకమైన ఓ ఊహా ప్రపంచం నేపథ్యంలో సాగనుంది. చిన్నారుల్ని అలరించే అంశాలు ఈ మూవీలో పుష్కలంగా ఉంటాయని సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. ఈ సినిమా కోసం చిరంజీవి కూడా ప్రత్యేకంగా సన్నద్ధమవుతున్నారట. ఆస్కార్ దర్శకుడు కీరవాణి సంగీతమందిస్తున్నారు.




## రష్మిక.. అన్ని వైపులా హిట్టే



నేషనల్ క్రష్ రష్మిక మందన యానిమల్ మూవీ సక్సెస్ తో ఓ రేర్ ఫీట్ అందుకుంది. దీనికంటే ముందు బాలీవుడ్ లో పలు సినిమాలు చేసింది. అవేమీ ఈమెకు గుర్తింపు తేలేకపోయాయి. కానీ రణబీర్ సరసన నటించిన యానిమల్ రష్మిక కి బాలీవుడ్ లో బిగ్గెస్ట్ హిట్ ని అందించింది. ఈ సక్సెస్ తో బాలీవుడ్ లోనే కాదు అన్ని ఇండస్ట్రీలోనూ బ్లాక్ బస్టర్ హిట్స్ అందుకున్న హీరోయిన్ గా అరుదైన ఘనత సాధించింది రష్మిక మందన. టాలీవుడ్ ఇండస్ట్రీలో స్టార్ స్టేటస్ అందుకున్న రష్మికకి తెలుగులోనే కాకుండా హిందీ, తమిళ ఇండస్ట్రీల్లోనూ మంచి క్రేజ్ ఉంది. అందుకే తెలుగులో సినిమాలు చేస్తూనే హిందీ, తమిళ భాషల్లో వరుస అవకాశాలు అందుకుంది. కిరిక్ పార్టీ అనే సినిమాతో కన్నడ ఇండస్ట్రీలో హీరోయిన్గా ఆరెంగేట్రం చేసిన రష్మిక మొదటి సినిమాతోనే అక్కడ బ్లాక్ బాస్టర్ అందుకుంది. ఆ తర్వాత 'ఛలో' సినిమాతో తెలుగు చిత్ర పరిశ్రమలకు అడుగుపెట్టి అగ్ర హీరోల సరసన వరుస బ్లాక్ బాస్టర్ హిట్స్ ని తన ఖాతాలో వేసుకుంది. ఇక ఈ ఏడాది కోలీవుడ్లో దళపతి విజయ్ సరసన 'వారిసు' మూవీలో నటించి తమిళంలో బ్లాక్ బస్టర్ అందుకుంది. ఇక ఇప్పుడు యానిమల్ తో బాలీవుడ్ లో మరో బ్లాక్ బస్టర్ సొంతం చేసుకుంది. అలా టాలీవుడ్ తో పాటు కోలీవుడ్, బాలీవుడ్, శాండిల్ వుడ్.. అన్ని ఇండస్ట్రీల్లో బ్లాక్ బస్టర్ అందుకున్న హీరోయిన్ గా సరికొత్త రికార్డు క్రియేట్ చేసిందిరష్మిక. యానిమల్ సక్సెస్ తో రష్మిక తన కెరీర్ ల్ పీక్ స్టార్ డమ్ ని ఎంజాయ్ చేస్తుంది. ఇక ఈ మూవీ తర్వాత ఈ ఈ ముద్దుగుమ్మకి పుష్ప: ది రూల్ తో పాటూ తన రాబోయే చిత్రాలతో మరింత క్రేజ్ పెరగడం ఖాయమని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదు. ఇక ప్రస్తుతం యానిమల్ సక్సెస్ ని తెగ ఎంజాయ్ చేస్తున్న రష్మిక 'పుష్ప 2' తో పాటు 'ది గర్ల్ ఫ్రెండ్' అని లేడీ ఓరియంటెడ్ మూవీ చేస్తోంది. ఇటీవలే ఈ సినిమా షూటింగ్ లాంచనంగా ప్రారంభమైంది. రాహుల్ రవీంద్రన్ ఈ ప్రాజెక్టును తెరకెక్కిస్తున్నారు. రష్మిక నటిస్తున్న ఫస్ట్ లేడీ ఓరియెంటెడ్ సబ్జెక్టు ఇదే కావడంతో ఈ ప్రాజెక్టుపై అందరిలో ఆసక్తి నెలకొంది. మరోవైపు ఇన్ని రోజులు యానిమల్ ప్రమోషన్స్ తో బిజీ బిజీగా గడిపిన రష్మిక త్వరలోనే పుష్ప 2 సెట్స్ లో అడుగుపెట్టనుంది. డిసెంబర్ 13 నుంచి రష్మిక 'పుష్ప 2' షూటింగ్లో జాయిన్ కానున్నట్లు సమాచారం.

## నా సామి రంగ.. మాస్ లో రొమాన్స్




టాలీవుడ్ మన్మథుడు, సీనియర్ హీరో నాగార్జున కొంచెం గ్యాప్ తీసుకుని అనౌన్స్ చేసిన సినిమా నా సామి రంగ. గత కొన్ని నెలలుగా థియేటర్లలో సందడి చేయని నాగ్.. నేరుగా వచ్చే ఏడాది సంక్రాంతి బరిలో నిలిచారు. బాక్సాఫీస్ వద్ద మరో నాలుగు సినిమాలతో పోటీ పడనున్నారు. ప్రస్తుతం నాగార్జున సినిమా షూటింగ్ ను శరవేగంగా చేస్తున్నారు మేకర్స్. ఈ సినిమాలో నాగార్జున సరసన కన్నడ భామ ఆషికా రంగనాథ్ హీరోయిన్ గా నటిస్తుండగా.. ఇంకో హీరోయిన్ కూడా ఉందని సమాచారం. డ్యాన్స్ మాస్టర్ విజయ్ బిన్నీ దర్శకుడిగా మారి ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే రిలీజైన గ్లింప్స్, పోస్టర్స్ చూస్తుంటే పండుగకు నాగార్జున మంచి సందడి చేయనున్నట్లు తెలుస్తోంది. మరోవైపు, ఈ సినిమా ప్రమోషన్లను మేకర్స్ తాజాగా మొదలుపెట్టేశారు. ఈ సినిమా నుంచి ఎత్తుకెళ్లిపోవాలనిపిస్తుందే అంటూ సాగే లిరకల్ సాంగ్ ను ఆదివారం రిలీజ్ చేశారు. ఈ పాటకు చంద్రబోస్ లిరిక్స్ రాయగా.. ఆస్కార్ దర్శకుడు ఎంఎం కీరవాణి బాణీలు అందించారు. సింగర్ రామ్ మిరియాల ఈ పాటకు తన గాత్రంతో ప్రాణం పోశారు. ఈ సాంగ్ లో నాగార్జున, ఆషికా రంగనాథ్ కలిసి వేసిన స్టెప్స్ ను మేకర్స్ చూపించారు. నాగ్- ఆషిక కెమిస్ట్రీ అందరినీ ఆకట్టుకుంటోంది. లిరికల్ సాంగ్ లో ఎప్పటిలాగే తన లుక్స్ తో నాగార్జున ఆకట్టుకోగా.. ఆషిక కుందనపు బొమ్మలా ఉందని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. పాటలో విజువల్స్ చాలా గ్రాండ్ గా ఉన్నట్లు చెబుతున్నారు. ప్రస్తుతం ఈ పాట ట్రెండింగ్ లో ఉంది. టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ సిల్వర్ స్క్రీన్ పతాకంపై శ్రీనివాస చిట్టూరి నిర్మిస్తున్నారు. పవన్ కుమార్ ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. ఇక సంక్రాంతి పండగకు నాగార్జున ఎప్పటిలాగే ఫుల్ ఎంటర్టైన్మెంట్ ఇస్తారని అంతా భావిస్తున్నారు. సంక్రాంతికి రిలీజ్ అని మేకర్స్ ఇప్పటికే చెప్పినా ఈ సినిమా విడుదల తేదీ మాత్రం ఇంకా ప్రకటించలేదు. జనవరి 11 లేదా 14వ తేదీన రిలీజ్ చేయాలని మేకర్స్ భావిస్తున్నారట.

## న్యూయార్క్ ఫిలిం కోర్స్ బాగానే పనిచేస్తుందా?

'మెహబూబ' తో టాలీవుడ్ లో తెరంగేట్రం చేసింది నేహాశెట్టి. పెద్ద ప్రాజెక్ట్ ..పూరి జగన్నాథ్ తెరకెక్కించిన సినిమా కావడంతో అమ్మడి కెరీర్ కి తిరుగుండదని భావించింది. కానీ నేహా కెరీర్ ఆవిధంగా సాగలేదు. ఆ ఫ్లాప్ తో అమ్మడు మళ్లీ కనిపించలేదు. అటుపై కొంత గ్యాప్ అనంతరం 'డీజే టిల్లు'లో ఛాన్స్ దక్కించుకుని...కుర్రాళ్ల హృదయాల్లో రాధిక అక్కగా ఫేమస్ అయింది. ఆ తర్వాత వరుసగా అవకాశాలు అందుకుని బిజీ నటిగా మారింది. కానీ ఈ మధ్యలో రాధిక అక్క చాలా సహవాసాలే చేసిందని ఎంత మందికి తెలుసు. అవును. కెరీర్ లో ఎదగడం కోసం అమ్మడు ఖండాలు దాటి ప్రత్యేకంగా శిక్షణ తీసుకోవడంతోనే నేడు నటిగా మంచి గుర్తింపు దక్కించుకుంది. అందుకు అమెరికాలో తాను తీసుకున్న శిక్షణ ఎంతో ఉపయుక్తంగా మారింది అంటోంది. ఆ విశేషాలు ఆమె మాటల్లోనే.. 'న్యూయార్క్ ఫిలిం అకాడెమీలో 4 నెలల కోర్స్ చైసాను. నటిగా నేను మెరుగు అవ్వడంలో ఈ కోర్స్ ఎంతో ఉపయోగపడింది. నటిగా



వైవిధ్యంగా కనిపించాలి. భిన్నమైన క్యారెక్టర్స్‌లో నటించాలనే నా ప్రయత్నానికి న్యూయార్క్ ఫిలిం అకాడెమీలో చేసిన కోర్స్ బాగా హెల్ప్ అవుతోంది. పాత్రల మధ్య వ్యత్యాసాన్ని కోర్స్ పూర్తిచేసిన తర్వాత బాగా తెలుసుకోగల్గుతున్నాను. తొలి సినిమా సమయానికి నాకు ఎలాంటి అనుభవం లేదు. ఛాన్స్ వచ్చింది కాబట్టి నటించాను. అంతకు మించి నాకేం తెలియదు. కానీ నటన గురించి నాకు తెలియంది..నేర్చుకోవాల్సింది చాలానే ఉందని కాలక్రమంలో అర్ధమైంది. అందుకే కొంత శిక్షణ అవసరమని భావించి న్యూయార్క్ వెళ్లాను' అని తెలిపింది. ప్రస్తుతం ఈ బ్యూటీ ' గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' బుజ్జి పాత్రలో నటించింది. ఇందులో అమ్మడు విశ్వక్ సేన్ కి జోడీగా నటిస్తోంది. కృష్ణ చైతన్య దర్శకత్వంలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్- ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంయుక్తంగా నిర్మించాయి. ఈ సినిమా మార్చి 8న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే రిలీజ్ అయిన ప్రచార చిత్రాలు సినిమాకి మంచి బజ్ ని తీసుకొస్తున్నాయి.

## 'యానిమల్' లో ఇలా ఎంటర్ అయ్యా...!

రణబీర్ కపూర్ హీరోగా రష్మిక మందన్న హీరోయిన్ గా సందీప్ వంగ దర్శకత్వంలో రూపొందిన యానిమల్ సినిమా ఇటీవల విడుదల అయ్యి మంచి విజయాన్ని సొంతం చేసుకున్న విషయం తెల్సిందే. ఈ సినిమాలో రణబీర్ మరియు రష్మిక పాత్రలతో పాటు మరి కొన్ని పాత్రల గురించి ప్రధానంగా చర్చ జరుగుతోంది. అందులో త్రిప్తి డిమ్రి పాత్ర గురించి పాజిటివ్ చర్చ జరుగుతోంది. నెట్ ఫ్లిక్స్ లో క్వాలా సిరీస్ ద్వారా ప్రేక్షకుల పరిచయం అయిన ఈ అమ్మడు యానిమల్ సినిమాలో కనిపించింది కొద్ది సమయం అయినా కూడా మంచి పేరును దక్కించుకుంది. యానిమల్ సినిమాలో ఎలా ఆఫర్ వచ్చింది అనే విషయం పై తాజాగా ఒక ఇంటర్వ్యూలో ఈ అమ్మడు



స్పందించింది. త్రిప్తి మాట్లాడుతూ... ఒక యాడ్ షూట్ లో ఉన్న సమయంలో దర్శకుడు సందీప్ వంగ నుంచి కాల్ వచ్చింది. క్వాలా వెబ్ సిరీస్ లో నీ నటన బాగుంది, నేను తీయబోతున్న ఒక సినిమాలోని ఒక పాత్రకు నీవు సూట్ అవుతావని భావిస్తున్నాను అన్నారు. తప్పకుండా నటిస్తానంటూ ఆ సమయంలో చెప్పాను. ఏడాది వరకు సందీప్ నుంచి కాల్ రాకపోవడంతో ఆఫర్ లేనట్లే అనుకున్నాను. కానీ చాలా రోజుల వెయిటింగ్ తర్వాత సందీప్ నుంచి కాల్ వచ్చింది. ఒక నెగటివ్ షేడ్స్ ఉన్న పాత్ర కానీ మంచి పాత్ర అని ఆయన అన్నాడు. ఆయన ఇచ్చిన నమ్మకంతో సినిమా ను చేశాను. ఇప్పుడు ఆయన అన్నట్లుగానే నా పాత్రకు మరియు నాకు మంచి గుర్తింపు లభించిందని త్రిప్తి డిమ్రి అభిప్రాయం వ్యక్తం చేసింది.




# రూ.56వేల కోట్ల నష్టంలో పౌరసరఫరాల శాఖ

హైదరాబాద్: గత పాలకుల వల్ల పౌరసరఫరాల శాఖలో తప్పిదాలు జరిగాయని తెలంగాణ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. పేదలకు నాణ్యమైన బియ్యం ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. హైదరాబాద్‌లో పౌర సరఫరాల శాఖపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ధాన్యం సేకరణ, మిల్లింగ్ సామర్థ్యం, బియ్యం నాణ్యతపై అధికారులు మంత్రికి వివరించారు. అనంతరం ఉత్తమ్ మీడియాతో మాట్లాడారు.

"పౌర సరఫరాల శాఖ ఆర్థిక పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఈ శాఖ రూ.56వేల కోట్ల నష్టంలో కొనసాగుతోంది. 12 శాతం మంది వినియోగదారులు రేషన్‌కార్డులు ఉపయోగించలేదు. రేషన్ బియ్యాన్ని కొందరు పక్కదారి పట్టిస్తున్నారు.

రైతుల నుంచి ధాన్యం సేకరణ పారదర్శకంగా జరగాలి. మిల్లర్ల సమస్యలపైనా అధికారులతో చర్చించాం. కొత్త రేషన్ కార్డు దరఖాస్తులపై త్వరలో నిర్ణయం తీసుకుంటాం. ప్రజలకు అవినీతిలేని పారదర్శకమైన పాలన అందిస్తాం. వంద రోజుల్లో రూ.500కే గ్యాస్ సిలిండర్ హామీని అమలు చేస్తాం" అని ఉత్తమ్ తెలిపారు.

# రూ.500కే గ్యాస్ సిలిండర్..మంత్రి ఉత్తమ్ కుమార్ క్లారిటీ

హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మరో రెండు గ్యారెంటీలపై రాష్ట్ర పౌరసరఫరాల, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి క్లారిటీ ఇచ్చారు. రూ.500కే వంట గ్యాస్ సిలిండర్, వరికి రూ.500 బోనస్ హామీలను వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పారు. మంగళవారం సివిల్ సప్లై అధికారులతో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. 'సివిల్ సప్లై శాఖ రాష్ట్రంలో ముఖ్యమైన శాఖ. రూ.500కు గ్యాస్ సిలిండర్, వరికి రూ.500 బోనస్ మరో వంద రోజుల్లో అమలు చేస్తాం. ప్రజలకు ఇచ్చే బియ్యంలో 5 కిలోల బియ్యం కేంద్రం ఇస్తోంది. రాష్ట్రం ఇచ్చే కిలో బియ్యం క్వాలిటీ పెరగాలి. ఇప్పటి వరకు ఒక కిలోనే ప్రతీ మనిషికి బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చింది. బియ్యం తీసుకునే లబ్ధిదారులు రాష్ట్రంలో 2కోట్ల 80 లక్షల మంది ఉన్నారు. వడ్ల కొనుగోలుకు సివిల్ సప్లై శాఖ అన్ని చర్యలు తీసుకోవాలి. రైతులకు డబ్బు వెంటనే అందాలి' అని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. 'ప్రజలకు ఉచితంగా ఇచ్చే బియ్యాన్ని వారు ఉపయోగించుకుంటున్నారా లేదా అన్నది గమనించాలి. కిలో 39 రూపాయలు పెట్టి మనం సేకరిస్తున్న బియ్యం ప్రజలకు ఉచితంగా అందిస్తున్నాం. అవి పేదలు తినకపోతే ఇంత పెద్ద గొప్ప ఉచిత బియ్యం పథకం నిరుపయోగం అవుతుంది. మొక్కుబడిగా బియ్యం పంపిణీ కాకుండా లోపాలు ఎక్కడ ఉన్నాయో వెతకాలి. బియ్యం లబ్దిదారులను ర్యాండమ్ చెక్ చెయ్యాలి. ప్రజల నుంచి సమాచారం సేకరించాలి' అని ఉత్తమ్ అధికారులకు సూచించారు. 'గత ప్రభుత్వం సివిల్ సప్లై శాఖకు ఆర్థిక సహాయం చేయకపోవడంతో 56 వేల కోట్లు అప్పు చేసింది. రూ.11 వేల నష్టాల్లో శాఖ కూరుకుపోయింది. తొమ్మిదిన్నర ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో లోపాలున్నాయి.రాష్ట్రంలో అన్ని శాఖల్లో ఆర్థిక పరిస్థితి బాగోలేదు. ఉన్న రేషన్ కార్డు లబ్ధిదారుల్లో బియ్యం తీసుకున్న వారు 89 శాతం దాటడడం లేదు. కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలన్న డిమాండ్ ఉంది. సీఎం దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్తా' అని ఉత్తమ్ తెలిపారు.



# రేవంత్ మార్క్ ట్రాన్స్‌ఫర్లు: హైదరాబాద్‌కు కొత్త పోలీస్ కమిషనర్..!!

హైదరాబాద్: తెలంగాణ కొత్త ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. పరిపాలనపై తనదైన ముద్ర వేస్తోన్నారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన రెండో రోజే రెండు హామీలను అమల్లోకి తీసుకొచ్చారు. టీఎస్ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని కల్పించడానికి ఉద్దేశించిన మహాలక్ష్మి పథకం, ఆరోగ్యశ్రీ కింద బీమా కవరేజీ మొత్తాన్ని 10 లక్షల రూపాయలకు పెంచారు. ఇక శాంతిభద్రతలపై దృష్టి సారించారు రేవంత్ రెడ్డి. అత్యంత కీలకమైన హైదరాబాద్, దీనికి ఆనుకుని ఉన్న కమిషనరేట్లను మరింత బలోపేతం చేసేలా చర్యలు తీసుకున్నారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లకు కొత్త అధిపతులను నియమించారు. దీనికి సంబంధించిన ఫైల్‌పై ఆయన సంతకం చేశారు. తెలంగాణలో కొత్త అడ్వకేట్ జనరల్ ఎవరు..ఆయనకే ఛాన్స్..! మొత్తం అయిదుమంది సీనియర్ ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి కొద్దిసేపటి కిందటే జీవో 1632ను విడుదల చేశారు. హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్‌గా కొత్తకోట శ్రీనివాస్ రెడ్డిని నియమించారు. ప్రస్తుతం ఆయన పోలీస్ విభాగం ఆర్గనైజేషనల్ అండ్ లీగల్ అదనపు పోలీస్ డైరెక్టర్‌గా పని చేస్తోన్నారు. యాంటీ నార్కొటిక్స్ బ్యూరో డైరెక్టర్‌గా సందీప్ శాండిల్య బదిలీ అయ్యారు. హైదరాబాద్ ట్రాఫిక్ విభాగం అదనపు కమిషనర్ జీ సుధీర్ బాబుకు స్థానచలనం కలిగింది. ఆయనను రాచకొండ పోలీస్ కమిషనర్‌గా బదిలీ చేశారు. అక్కడున్న దేవేంద్ర సింగ్ చౌహాన్‌కు పోస్టింగ్ ఇవ్వలేదు ప్రభుత్వం.

సైబరాబాద్ జాయింట్ కమిషనర్ (అడ్మిన్) అవినాష్ మహంతి బదిలీ అయ్యారు. సైబరాబాద్ కమిషనర్‌గా అపాయింట్ అయ్యారు. ప్రస్తుతం అక్కడున్న స్టీఫెన్ రవీంద్ర బదిలీ అయ్యారు. ఆయనకు పోస్టింగ్ ఇవ్వలేదు. డీఎస్ చౌహాన్, స్టీఫెన్ రవీంద్రలను డీజీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాల్సిందిగా ఆదేశించారు.

# నేను కోలుకుంటున్నా.. దయచేసి ఆస్పత్రికి రావొద్దు: కేసీఆర్ విజ్ఞప్తి




హైదరాబాద్: సర్జరీ అనంతరం తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఆస్పత్రిలోనే కోలుకుంటున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఆయన్ని పరామర్శించేందుకు ప్రముఖులు ఆస్పత్రికి క్యూ కడుతున్నారు. అయితే ఇవాళ సోమాజిగూడ యశోద ఆస్పత్రి వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. కేసీఆర్‌ను కలిసేందుకు పెద్ద ఎత్తున బీఆర్ఎస్ శ్రేణులు, ఆయన అభిమానులు ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. ఆయన్ని చూసేందుకు అనుమతించాలంటూ పోలీసులను కోరారు. అయితే భద్రతా కారణాల దృష్ట్యా అందుకు పోలీసులు కుదరదని చెప్పారు. దీంతో కేసీఆర్.. బీఆర్ఎస్.. కేటీఆర్ నినాదాలతో ఆస్పత్రి ప్రాంగణంలో ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. పోలీసులు చేతులెత్తిసిన క్రమంలో కేటీఆర్ రంగంలోకి దిగారు. ఆస్పత్రి నుంచి బయటకు వచ్చిన ఆయన క్యాడర్‌ను సముదాయించడంతో కాస్త శాంతించినట్లు తెలుస్తోంది.

**కేసీఆర్ విజ్ఞప్తి..** మరోవైపు ఆస్పత్రి బయట పరిస్థితులు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దృష్టికి వెళ్లాయి. దీంతో బీఆర్ఎస్ కేడర్‌ను, అభిమానుల్ని ఉద్దేశించి ఆయన వీడియో సందేశంలో విజ్ఞప్తి చేశారు. "నేను కోలుకుంటున్నా.. త్వరలో మీ ముందుకు వస్తా. దయచేసి ఎవరూ ఆస్పత్రికి రావొద్దు. నాతో పాటు వందలాది మంది పేషెంట్లు ఇక్కడ ఉన్నారు. వాళ్లకు ఇబ్బంది కలిగించొద్దు. దయచేసి పార్టీ కార్యకర్తలు, నా అభిమానులు సహకరించాలి. నాపట్ల అభిమానం చూపుతున్న ప్రతీ ఒక్కరికీ కృతజ్ఞతలు" అని కేసీఆర్ పేర్కొన్నారు.

**కేసీఆర్ ఆరోగ్యంగానే ఉన్నారు: తెలంగాణ మంత్రులు** – మాజీ సీఎం కేసీఆర్ ఆరోగ్య విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఆయన ఆరోగ్యంగా ఉన్నారని తెలంగాణ మంత్రులు అన్నారు. మంత్రులు దామోదర రాజనర్సింహ, దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆయన్ని ఇవాళ ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. "మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌ని పరామర్శించేందుకు వచ్చాం. ఆయన ఆరోగ్యంగా ఉన్నారు. బహుశా రెండ్రోజుల్లో డిశ్చార్జ్ అవుతారేమో" అని మంత్రి దామోదర రాజనర్సింహ చెప్పగా.. "కేసీఆర్ త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాం. అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొనాలని కోరాం. త్వరగా సభకు వచ్చి వారికున్న సుదీర్ఘ రాజకీయ అనుభవాన్ని అందించాలని కోరాం. అందరూ నాయకులను కలుపుకుని ప్రజలకు మంచి పాలన అందిస్తామని ఆయనకు హామీ ఇచ్చాం. స్పీకర్ ఎన్నికలో కూడా ఏకగ్రీవంగా ఎన్నిక జరిగేవిధంగా సహకరించాలని అడిగాం" అని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చెప్పారు.

# ఫైల్స్ చోరీ కేసు.. హైకోర్టును ఆశ్రయించిన తలసాని ఓఎస్డీ



హైదరాబాద్: మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఓఎస్డీ కల్యాణ్ కుమార్ తాజాగా తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. పశుసంవర్ధక శాఖలో ఫైల్స్ చోరీపై నమోదైన కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ ఆయన హైకోర్టులో పిటిషన్ దాఖలుచేశారు. అయితే, మూడు రోజుల క్రితం.. పశుసంవర్ధక శాఖలో ఫైల్స్ చోరీ అయిన ఉదంతంలో కల్యాణ్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. కార్యాలయం నుంచి పలు కీలక ఫైళ్లను తీసుకెళ్లారని, మిగతా ఫైళ్లను చిందరవందరగా పడేశారని పేర్కొన్నారు. ఆఫీస్‌లో సీసీ కెమెరాలను ధ్వంసం చేశారన్న వాచ్‌మన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కల్యాణ్‌తోపాటు మరో నలుగురిపై కేసు నమోదు చేశారు. ఈ కేసులో తనను అరెస్టు చేయకుండా ముందస్తు బెయిల్ కోరుతూ కల్యాణ్ హైకోర్టును ఆశ్రయించారు. ఇదిలా ఉండగా.. మాసబ్‌ట్యాంక్‌లోని పశు సంవర్ధకశాఖ కార్యాలయంలోనికి అక్రమంగా ప్రవేశించిన కల్యాణ్ బీరువాలో ఉన్న ద్రస్తాలను కారులో తరలించుకునిపోయారు. వాచ్‌మన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అతడిపై కేసు నమోదు చేశారు. అక్కడి సిబ్బంది సహాయంతో బీరువాలో ఉన్న ఫైళ్లను చింపేశారు. అంతటితో ఆగకుండా చించివేసిన ఫైళ్లను తన కారులో తరలించుకుని పోయారు. అక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు సైతం పనిచేయకుండా చేశారు. దీంతో వాచ్‌మెన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కళ్యాణ్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు వివరించారు. అతడికి సహకరించిన కంప్యూటర్ ఆపరేటర్స్ ఎలిజ మోహన్, అటెండర్లు వెంకటేశ్, ప్రశాంత్‌లపైనా కేసులు నమోదు చేశామని పోలీసులు చెప్పారు.




# 2024 ఏడాదికి.. 27 సాధారణ.. 25 ఐచ్ఛిక సెలవులు..

హైదరాబాద్: 2024 ఏడాదికి గాను సాధారణ, ఐచ్ఛిక సెలవుల జాబితాను తెలంగాణ ప్రభుత్వం ఖరారు చేసింది. 2024లో మొత్తంగా 27 సాధారణ సెలవులు, 25 ఐచ్ఛిక సెలవులు ఉన్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. కొత్త ఏడాది సందర్భంగా జనవరి ఒకటో తేదీన సెలవు ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం.. అందుకు బదులుగా ఫిబ్రవరి 10వ తేదీన రెండో శనివారాన్ని పనిదినంగా ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు.




# నాగర్ కర్నూల్‌లో.. తీర్థం పేరిట నోట్లో యాసిడ్ పోసి..

నాగర్‌కర్నూల్: తాంత్రిక పూజలతో గుప్త నిధులు సేకరిస్తానని నమ్మించి 11 మందిని పొట్టన పెట్టుకున్న వ్యక్తిని పోలీసుల అరెస్ట్ చేశారు. నిందితుడిని నాగర్ కర్నూల్‌లోని ఇంద్రానగర్ కాలనీకి చెందిన రామటి సత్యనారాయణ (47)గా గుర్తించారు. ఈ మేరకు గద్వాల జోన్ డీఐజీ ఎల్.ఎస్.చౌహాన్ మీడియా సమావేశం నిర్వహించి కేసు వివరాలను వెల్లడించారు.

డీఐజీ ఎల్.ఎస్.చౌహాన్ మాట్లాడుతూ.. "నిందితుడు గుప్త నిధుల పేరుతో నమ్మించి 11 మందిని కిరాతంగా హతమార్చాడు. తెలంగాణ, ఏపీ, కర్ణాటకలో ఈ హత్యలు చేశాడు. తాంత్రిక పూజలు చేసి గుప్త నిధులు సేకరిస్తానని అమాయకులను నమ్మించేవాడు. వారి నుంచి డబ్బు తీసుకోవడంతో పాటు స్థలాలు, భూములు రాయించుకునేవాడు. ఆ తర్వాత నిర్జన ప్రదేశానికి తీసుకెళ్లి హతమార్చేవాడు. వనపర్తి, నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, కల్వకుర్తి.. కర్ణాటకలోని బలగనూరు, ఏపీలోని అనంతపురంలో ఈ హత్యలు జరిగాయి. తీర్థం పేరుతో నోటిలో యాసిడ్ పోసి చంపేవాడు. నిందితుడి నుంచి కారుతో పాటు మొబైల్ ఫోన్లు, సిమ్‌కార్డులు, విష పదార్థాలు, ఎలక్ట్రికల్ డిటోనేటర్లు స్వాధీనం చేసుకున్నాం. నిందితుడి ఆస్తులపై దర్యాప్తు చేపడతాం. ఇలాంటి వారిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి" అని డీఐజీ సూచించారు.

**వెలుగులోకి ఇలా..** వనపర్తి జిల్లా వీపనగండ్ల మండలానికి చెందిన రియల్‌ఎస్టేట్ వ్యాపారి వెంకటేశ్ హైదరాబాద్‌లోని బొల్లారంలో నివసించేవారు. నవంబరులో నగర శివారులో అతను హత్యకు గురయ్యాడు. వెంకటేశ్ కుటుంబసభ్యులతో నిందితుడికి కొంతకాలంగా పరిచయం ఉండటంతో అనుమానం వచ్చి అదే నెల 26న నాగర్‌కర్నూల్ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు.. వెంకటేశ్ వద్ద నిందితుడు డబ్బులు తీసుకొన్న అనంతరం క్షుద్రపూజల పేరుతో హత్య చేసినట్లు గుర్తించారు. దీని ఆధారంగా తీగ లాగడంతో ఇదే తరహాలో అనేక హత్యలు చేసినట్లుగా వెల్లడైంది.

# దురదృష్టవశాత్తు అధికారం కోల్పోయాం: హరీశ్ రావు



సంగారెడ్డి: దురదృష్టవశాత్తు మనం అధికారం కోల్పోయాం.. బీఆర్ఎస్ ఒడిదొడుకులు కొత్త కాదని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. సంగారెడ్డిలో నిర్వహించిన బీఆర్ఎస్ కృతజ్ఞత సభలో హరీశ్‌రావు మాట్లాడారు. పరీక్ష ఫెయిల్ అయిన తర్వాత విద్యార్థి కుంగిపోతే ఇంకో పరీక్ష పాస్ కాలేడని అన్నారు. రానున్న రోజుల్లో స్థానిక, పార్లమెంట్ ఎన్నికల రూపంలో పరీక్షలు రాబోతున్నాయని తెలిపారు. వచ్చే ఎన్నికలు ఎదుర్కోవడానికి పకడ్బంధీ కార్యాచరణతో ముందుకు పోదామని చెప్పారు. కేసీఆర్ పాలనలో తెలంగాణ ఎన్నో విజయాలు సాధించిందని అన్నారు. వాళ్లు మనకన్నా బాగా పాలిస్తారని ప్రజలు అవకాశమిచ్చారని తెలిపారు. దుష్ప్రచారం కూడా కొంతపై చేయి సాధించిందని తెలిపారు. కేవలం 2 శాతం ఓట్లతో అధికారం కోల్పోయామని, బీఆర్ఎస్ ఎపుడూ తెలంగాణ ప్రజల పక్షమేమని స్పష్టం చేశారు. తెలంగాణ తెచ్చిన పార్టీ బీఆర్ఎస్ అని గెలిచినప్పుడు పొంగి పోలేదు.. ఓటమితో కుంగి పోలేదని తెలిపారు. కొత్త ప్రభుత్వానికి కొంత టైం ఇద్దామని, వాళ్ళిచ్చిన హామీల అమలులో విఫలం అయితే ప్రజా గొంతుక అవుదామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మన నైతిక స్థైర్యాన్ని దెబ్బ తీసేందుకు కొందరు ప్రయత్నిస్తుంటారని, మనం ధైర్యం కోల్పోవద్దని ఏమైనా లోపాలు ఉంటే సమీక్షించుకుందామని అన్నారు. మనకు పోరాటాలు కొత్త కాదని,భవిష్యత్ మనదేనని అన్నారు. కేసీఆర్ దమ్మున్న నాయకుడు కనుకే తెలంగాణ వచ్చిందని తెలిపారు.సంగారెడ్డి కార్యకర్తల గురించి ఎంత చెప్పినా తక్కువేనని, కార్యకర్తలకే సంగారెడ్డి విజయం అంకితం చేస్తున్నానని తెలిపారు.

# ఢిల్లీలో మంత్రి కోమటిరెడ్డి.. రింగ్‌రోడ్, తెలంగాణ భవన్‌పై కీలక వ్యాఖ్యలు



ఢిల్లీ: తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఢిల్లీ పర్యటనలో ఉన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ భవన్‌ను పరిశీలించారు. అనంతరం, ఢిల్లీలో కొత్త తెలంగాణ భవన్ ఏర్పాటుపై అధికారులతో కోమటిరెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ క్రమంలో వెంకట రెడ్డి మాట్లాడుతూ..'ఢిల్లీలో వీలైనంత త్వరగా కొత్తగా తెలంగాణ భవన్ నిర్మిస్తాం. ప్రస్తుతం ఉన్న భవన్‌లో అందరూ ఇబ్బందులు పడుతున్నారు. ఏపీ భవన్ విభజనలో ఎలాంటి వివాదం లేదు. గత ప్రభుత్వ విధానానికి భిన్నమైన వైఖరి మేం తీసుకుంటాం. రీజినల్ రింగ్ రోడ్డు తెలంగాణకు మరొక మణిహారం. ట్రిపుల్ ఆర్ సహా పలు జాతీయ రహదారుల అంశాలపై మాట్లాడేందుకు నేషనల్ హైవే అథారిటీ ఛైర్మన్‌ను కలుస్తున్నాం. రెండు నెలల్లో ట్రిపుల్ ఆర్ నిర్మాణానికి టెండర్లు పిలుస్తాం' అని కామెంట్స్ చేశారు. మరోవైపు.. ఢిల్లీలో మంత్రి కోమటిరెడ్డిని ప్రత్యేక హోదా పోరాట సమితి ప్రతినిధులు కలిశారు. ఈ సందర్భంగా వారితో కోమటిరెడ్డితో మాట్లాడుతూ..'రాష్ట్ర విభజన సందర్భంగా ఏపీకి ప్రత్యేక హోదా అని అప్పటి పీఎం మన్మోహన్ చెప్పారు. ఇప్పటికీ విభజన చట్టం అమలుపరచకపోవడం బాధాకరం. నా వంతు ప్రయత్నం చేస్తాను. ప్రత్యేక హోదాపై ప్రధానమంత్రి హోదాలో మన్మోహన్ సింగ్ పార్లమెంట్‌లో చెప్పారు, అమలుపరిచే బాధ్యత ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వానిది' అని వ్యాఖ్యలు చేశారు.

**ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలి:** ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని.. దానికోసం తన వంతు కృషి చేస్తానని తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర విభజన సమయంలో ప్రత్యేక హోదాపై ప్రధాని హోదాలో మన్మోహన్‌సింగ్ హామీ ఇచ్చిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. దిల్లీలో కోమటిరెడ్డి మీడియాతో మాట్లాడారు. "ఆంధ్రప్రదేశ్‌ను ఆదుకోవాలని పార్లమెంట్‌లో ప్రత్యేకహోదా హామీ ఇచ్చారు. విభజన వేళ ఇచ్చిన హామీని అమలు చేయకపోవడం బాధాకరం. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నా" అని ఆయన అన్నారు.

# టీఎస్‌పీఎస్సీ ఛైర్మన్ రాజీనామాను గవర్నర్ ఆమోదించలేదు: రాజ్‌భవన్ వెల్లడి




హైదరాబాద్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ఛైర్మన్ బి.జనార్ధన్‌రెడ్డి రాజీనామాను గవర్నర్ తమిళిసై ఆమోదించలేదు. ఈ మేరకు రాజ్‌భవన్ ఓ ప్రకటన విడుదల చేసింది. జనార్ధన్‌రెడ్డి రాజీనామాను ఆమోదించినట్లు ప్రచారం జరిగిన నేపథ్యంలో రాజ్‌భవన్ క్లారిటీ ఇచ్చింది. ఆయన రాజీనామా ఆమోదం పొందినట్లు వచ్చిన వార్తలు అవాస్తవమని తెలిపింది. సోమవారం సాయంత్రం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన అనంతరం టీఎస్‌పీఎస్సీ ఛైర్మన్ పదవికి జనార్ధన్‌రెడ్డి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం పుదుచ్చేరి పర్యటనలో ఉన్న గవర్నర్‌కు అన్ని వివరాలు పంపించామని రాజ్‌భవన్ వర్గాలు తెలిపాయి.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com